ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

7

సోమవారం 28 అక్టోబరు 2024


నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 28వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నాళ్లు.. ఎన్నేళ్లు..!

● ప్రారంభం కాని గృహాలు రద్దు..!
● జిల్లాలో 7500పైగా...
● అర్బన్ హౌసింగ్, ఇందిరమ్మలకూ స్వస్తి
● కొత్త పథకంలో లబ్ధిదారులకు అవకాశం
● ఇదే దారిలో ఇంటి పట్టా కూడా?


మదనపల్లె మండలం పోతబోలులోని జగనన్న కాలనీ

మదనపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అయిదేళ్ల వైసీపీ పాలనలో అర్హతతో సంబంధం లేకుండా అయిన వారైతే చాలు ఇంటి పట్టాతో పాటు పక్కా ఇంటిని మంజూరు చేసి స్వామిభక్తిని చాటుకున్న అధికారులు..అదే లబ్ధిదారుల చేత ఇంటిని మాత్రం నిర్మించలేకపోయారు. పక్కా ఇంటికి ఇచ్చే సొమ్ములు కూడా రాష్ట్ర ప్రభుత్వం కాకుండా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిని కూడా తమ ఘనతగా చెప్పుకుంటూ తమ ఖాతాలో వేసుకున్న అప్పటి జగన్ ప్రభుత్వం లక్ష్యాలను పూర్తి చేయించడంలో విఫలమైంది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు టార్గెట్ ఇచ్చి మరీ వెంటాడినా లబ్ధిదారులు నిర్మాణానికి ముందుకు రాలేదు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా అయిదేళ్లలో 73 వేల గృహాలు మంజూరు చేయగా, అందులో సగానికిపైగా పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉండగా 7500 గృహాలు అసలు నిర్మాణాలే ప్రారంభించలేదు. అలాంటి వాటిని కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రద్దు చేసేసింది. లక్ష్యాలు సాధించడంలో లబ్ధిదారులకు నయానో, భయానో చెప్పినా ప్రయోజనం లేకపోయింది. బ్యాంకులు, స్వయం సహాయక సంఘాల్లో రుణాలు, ప్రభుత్వం అడ్వాన్సు ఇచ్చినా లక్ష్యం చేరుకోలేదు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన హౌసింగ్ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రద్దు చేశారు. తిరిగీ కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం యూనిట్ విలువను పెంచి వారికి అవకాశం కల్పించడానికి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సిద్ధం చేస్తోంది.

అయిదేళ్ల వైసీపీ పాలనలో కేంద్రం మంజూరు చేసిన పక్కా గృహాలను కొందరు లబ్ధిదారులు వివిధ కారణాలతో అసలు నిర్మాణమే ప్రారంభించలేదు. ఇంటికిచ్చే యూనిట్ విలువ రూ.1.80 లక్షల్లో కేంద్రం పూర్తి రాయితీ ఇచ్చింది. ఇందులో రూ.1.50 లక్షలతో పాటు, ఉపాధిహామీ పథకం కింద రూ.30 వేలు చెల్లిస్తున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం పెరగడం, ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు పునాదికి కూడా చాలకపోవడం, ఊరికి దూరంగా లేఅవుట్లు.. అవి కూడా కొండలు, గుట్టలు, ఎత్తు పల్లాలుగా ఉండడం, అక్కడ మౌలిక సదుపాయాలు లేకపోవడం, తదితర కారణాలతో లబ్ధిదారులు నిర్మాణానికి ముందుకు రాలేదు. ఇలా అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో సుమారు 7500పైగా ఇళ్లను రద్దు చేసినట్లు ఆ శాఖాధికారులు చెబుతున్నారు. వీటిని ఇప్పటికే సెంట్రల్ ఆన్‌లైన్ సర్వర్‌లో డిలిట్ చేయగా, భౌతికంగా లబ్ధిదారుల ఐడీతో కూడిన జాబితాను పంపుతున్నారు. వీరి ఐడీలు కూడా పూర్తిగా తొలగిస్తేనే, కూటమి ప్రభుత్వం మంజూరు చేసే జాబితాలో అవకాశం ఉంటుంది. ఇందుకు కావాల్సిన ప్రక్రియను గృహ నిర్మాణశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. మదనపల్లె హౌసింగ్ డీఈ పరిధిలోని మున్సిపాలిటీ, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో 1300 గృహాలు, తంబళ్లపల్లె డీఈ పరిధిలో 1600 మంది లబ్ధిదారుల పేరున మంజూరైన గృహాలను రద్దు చేశారు. ఇలా మూడు రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో 7500 పైగా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో ఆర్థిక ఇబ్బందులతో పాటు చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా కొంతమంది ఉన్నట్లు అధికారులు తమ సర్వేలో గుర్తించారు. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గాన్ని బట్టి రెండు, మూడు విడతలుగా పక్కా ఇళ్లు మంజూరు చేసింది. అయితే అయిదేళ్లు పూర్తయినా కనీసం పనులు ప్రారంభించకపోవడం, పునాదికి మట్టి తీసి వదిలేయడాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం వాటిని రద్దు చేస్తూ కొత్త పథకంలో అవకాశం కల్పించడానికి మార్గం సుగమం చేసింది.

జిల్లాలోని మూడు డివిజన్లలో 524 లేఅవుట్లలో గృహాలు మంజూరు చేసింది. ఇందులో మదనపల్లె, రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీలలో ఎక్కువగా లేఅవుట్లలోనే స్థలాలు కేటాయించారు. జిల్లాలోని 30 మండలాలలోనూ ప్రతిచోటా పది నుంచి 15 లేఅవుట్లు వేసి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించి పట్టా జారీ చేశారు. అలాంటి వారికే పక్కా ఇళ్లు మంజూరు చేశారు. ఇల్లు కట్టలేదని పక్కా ఇంటిని రద్దు చేస్తే, పట్టా మాటేంటనే ప్రశ్న ఉద్భవిస్తోంది. వీరిలో కూడా చాలామంది అనర్హులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నట్లు చెబుతున్నారు. రెండో దశలో పట్టా కూడా రద్దు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారునికి మదనపల్లె మున్సిపాలిటీలో ఒకటిన్నర సెంటు, ఇతర ప్రాంతాల్లో సెంటు స్థలం మాత్రమే కేటాయించింది. అదే కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు రెండు సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు జగనన్న పట్టాను రద్దు చేసి, నిజంగా అవసరమైన లబ్ధిదారునికి కేటాయించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ప్రకారం హౌసింగ్ లబ్ధిదారులకు రెండు సెంట్ల స్థలంతో పాటు పక్కా ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిసింది. ఫలితంగా కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితోపాటు ఇప్పటికే రద్దు చేసిన వారందరికీ విడతలవారీగా అవకాశం కలగనుంది. ఇందులో భాగంగానే పనులు ప్రారంభం కాని గృహాలను రద్దు చేసింది. వీటిని రద్దు చేయకుంటే సెంట్రల్ సర్వర్‌లో లబ్ధిదారుని ఐడీ పేరు మీద ఇల్లు మంజూరు చేసినట్లు చూపెడుతోంది. రూ.1.80 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేయలేకనే లబ్ధిదారుడు వదులుకున్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు జగనన్న పథకంలో ఇంటి నిర్మాణం ప్రారంభించి, ఒక బిల్లు తీసుకున్నా..కొత్త పథకంలో అనర్హుడు. ఈ ప్రభుత్వంలో అదే ఇంటిని పూర్తి చేసినా..పాత యూనిట్ ధర రూ.1.80 లక్షల ప్రకారమే మిగిలిన బిల్లు చెల్లించనున్నారు. అలాగే లబ్ధిదారులను నిర్మాణానికి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.20 వేలు అడ్వాన్సు కూడా ఇచ్చింది. ఈ డబ్బు తీసుకున్నా... చాలా మంది లబ్ధిదారులు అసలు పనే ప్రారంభించలేదు. కానీ వీటిని నాన్ స్టార్టెడ్ (ఎన్‌ఎస్) కేటగిరీలో తీసుకుని రద్దు చేయలేదు. ఎందుకంటే ప్రభుత్వం లెక్కలో వీరి అడ్వాన్సు కింద బిల్లు తీసుకున్నట్లు నమోదైంది. ప్రస్తుతం ఇలాంటి వారికి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లు అయింది. ఎందుకంటే వీరు ఇప్పుడు ఇంటి నిర్మాణం ప్రారంభించినా..యూనిట్ విలువ రూ.1.80 లక్షలు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటికే ఇల్లు మంజూరైనట్లు ఆన్‌లైన్‌లో చూపెడుతోంది. ఎంతసేపు అడ్వాన్సుగా తీసుకున్న డబ్బుకు క్షేత్రస్థాయిలో వారి చేత పని చేయించాల్సిన బాధ్యత హౌసింగ్, గృహనిర్మాణశాఖ అధికారులపై ఉంది. సర్వర్‌లో వీరి ఐడీ డిలిట్ కాదు..కొత్త ఇల్లు మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు 2005 నుంచి 2014 వరకూ వివిధ పథకాల కింద మంజూరైన అర్బన్ హౌసింగ్, ఇందిరమ్మ పథకాల కింద మంజూరై వివిధ దశల్లో ఉన్న గృహాలకు ప్రభుత్వం ఇప్పటికే బిల్లులు మంజూరు ఆపేసింది. 2014 నుంచి అమలులోకి వచ్చిన ఎన్‌టీఆర్ గృహాలు, ప్రోగ్రెస్‌లో ఉన్న జగనన్న గృహాలకు మాత్రమే బిల్లులు చెల్లించనున్నారు.

బాణాసంచా దుకాణాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి

● ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించాలి
● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రాయచోటిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణాసంచా తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్స్, విక్రయించే దుకాణాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలని, ప్రభుత్వ నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. గతంలో వివిధ ప్రదేశాల్లో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల శ్రేయస్సును ఉద్దేశించి బాణాసంచా తయారీ కేంద్రాలకు, నిల్వ చేసే గోడౌన్లకు, విక్రయించే దుకాణాలు ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. బాణాసంచా నిల్వ చేసే నిర్వాహకులు, తయారీ, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాలన్నారు. గోడౌన్లు నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. మండే స్వభావం ఉన్న పెట్రోల్, అగ్గిపెట్టెలు ఇతర వస్తువులు అనుమతించరాదన్నారు. బాణాసంచా విక్రయ దుకాణాలు అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. జనావాసాలకు, విద్యా సంస్థలకు, వైద్యశాలలకు దూరంగా బాణాసంచా విక్రయాలు జరగాలన్నారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు. పిల్లలు పటాకులు కాల్చేటప్పుడు పెద్దవాళ్లు పక్కన నిలబడి జాగ్రత్తలు తీసుకోవాలని, గడ్డివాములు, పశువుల పాకలు, గుడిసెలు, పెట్రోల్ బంక్‌ల దగ్గర ఎట్టి పరిస్థితుల్లోనూ పటాకులు కాల్చొద్దన్నారు. టపాసులను కాల్చిన తర్వాత చేతులను ముక్కులో, నోట్లో పెట్టుకోవద్దని సూచించారు. పటాకులు కాల్చేటప్పుడు కాటన్‌డ్రెస్‌లను మాత్రమే వేసుకోవాలన్నారు. లైసెన్సులు లేకుండా ఎవరైనా మందుగుండు సామాగ్రి తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు అధికారులు వారి పరిధిలోని బాణాసంచా తయారీ కేంద్రాలను, విక్రయ దుకాణాలను నిల్వ ఉంచిన గోడౌన్‌లను సందర్శించి లైసెన్సులు తనిఖీ చేయాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా బాణాసంచా సామగ్రి క్రయ విక్రయాలు, నిల్వలకు సంబంధించిన సమాచారం ఉంటే డయల్ 100, 112 నెంబర్‌లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

త్వరలో కడప నుంచి ఢిల్లీకి విమాన సౌకర్యం

● రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప మారుతీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నుంచి త్వరలో దేశ రాజధాని ఢిల్లీకి చేరుకునేలా విమాన సౌకర్యం కల్పించనున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం కడప విమానాశ్రయం నుంచి హైదరాబాద్ నగరానికి ఇండిగో కనెక్టింగ్ విమాన సర్వీసును లాంఛనంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అలాగే కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కడప విమానాశ్రయం నుంచి మహానగరాలైన హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విజయవాడ తదితర దూర ప్రాంతాలకు త్వరితగతిన చేరుకునేలా ఇండిగో యాజమాన్యం విమాన సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు ప్రధానంగా కేంద్ర పౌరవిమానశాఖ మంత్రిగా టీడీపీ ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు సేవలందిస్తుండడం వల్లే సాధ్యమైందన్నారు. అందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబునాయుడు సీఎం అయిన తర్వాత రైల్వేలో గత 20 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా కొత్తరూట్లు, రీమాడిఫికేషన్ లైన్స్ రావడం జరుగుతుందన్నారు. అలాగే పౌరవిమానశాఖ ద్వారా ఇక్కడి నుంచి 200 కి.మీ. దూరంలో గల ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్, తిరుపతి ఎయిర్‌పోర్ట్, కుప్పంలో కూడా గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ రాబోతున్నాయన్నారు. కడప జిల్లాలోని కొప్పర్తిని పారిశ్రామికవాడగా తీర్చిదిద్దేందుకు నిధులు వచ్చాయని, రానున్న నాలుగున్నరేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించేలా సీఎం చంద్రబాబు సారథ్యం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ సంవత్సర కాలంగా కడప నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసు లేక చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. ప్రస్తుతం విమాన సర్వీసులను పునరుద్ధరించడంతో ప్రయాణికులకు వెసులుబాటు కల్పించినట్లయిందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ మన ప్రభుత్వం రాగానే కడప నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసు కావాలని గత జులై 5 నుంచి పలు ఉత్తరాలు రాశామని, ఇప్పటికి ఆ కల సాకారమైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో అక్రమాల దందా

● ఫ్రీహోల్డ్ పేరుతో రూ.2 కోట్ల భూమిని వైసీపీ నాయకునికి కట్టబెట్టారు
● కలెక్టరుకు ఫిర్యాదు చేసిన బాధితులు

8



ఉద్యాన విద్యలో 'నైపుణ్యాభివృద్ధి'కి శ్రీకారం

● ఉద్యాన వర్సిటీ ఉపకులపతి గోపాల్


కొత్త కోర్సులను ప్రారంభిస్తున్న వీసీ గోపాల్

రైల్వేకోడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనంతరాజుపేట ఉద్యాన విద్యలో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ఏర్పాటు చేసినట్లు ఉద్యాన వర్సిటీ ఉపకులపతి గోపాల్ తెలిపారు. ఆదివారం అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో మహిళా రక్షణ, సాంస్కృతిక విభాగాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉద్యాన అభివృద్ధికి అందరూ కృషి చేయాలని తెలిపారు. జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకును సాధించేలా ఉద్యాన వర్సిటీ అడుగులు వేయాలన్నారు. అటవీ, వ్యవసాయ యాంత్రీకరణ, కూరగాయలు, పండ్లు ప్రాసెసింగ్ వంటి కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కీటక, తెగుళ్ల విభాగాల్లో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాల, ప్లాంటీ బ్రీడింగ్ విభాగాల్లో ప్రవేశాలు విద్యార్థులకు కల్పిస్తారని తెలిపారు. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు వాటి పరిశోధనలు వ్యాసాలపై గుర్తింపు పొందిన జర్నల్స్‌లో ప్రచురణకు తగిన ఆర్థిక వెసులుబాటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యాన కళాశాలలో మహిళా రక్షణ, సాంస్కృతిక విభాగాలను ప్రారంభించామని తెలిపారు. వీటి చైర్మన్‌గా ఆచార్యులు సీహెచ్ రూత్‌బెనర్జీని నియమించామని తెలిపారు. సభ్యులుగా ఆచార్యులు డాక్టర్ నదరుస్సీనా, డాక్టర్ ముకుందలక్ష్మీ, డాక్టర్ శిరీషా, డాక్టర్ దీప్తికిరణ్ వ్యవహరిస్తారన్నారు. మహిళా ఉద్యోగులు, ఉద్యాన విద్యార్థినుల భద్రత, సురక్షిత వాతావరణం కల్పించే దిశగా ఈ సెల్ పని చేస్తుందన్నారు. ఆచార్యులు రచించిన పుట్టగొడుగుల పెంపకం, బొప్పాయి సాగు వంటి పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్, ఉద్యాన పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ కే.ఎం యువరాజ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.స్వరాజ్య లక్ష్మీ, కళాశాల సీనియర్ ఆచార్యులు, ప్రొఫెసర్స్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూములు అన్యాక్రాంతం

● భవన నిర్మాణం, పొలాల సాగు
● ప్రేక్షకపాత్రలో అధికారులు
● కోర్టు తలుపు తట్టాల్సిందేనా?

8



పోరాటాలతోనే రాజ్యాధికారం

● కడప-బెంగళూరు రైల్వేమార్గం నిర్మాణంపై నిర్లక్ష్యం
● సీపీఎం జిల్లా మహాసభల్లో కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

రాయచోటి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారాన్ని దక్కించుకునేలా పేదలు, కార్మికులు సంఘటితంగా పోరాటం చేయాలని, పోరాటాల ద్వారానే రాజ్యాధికారం సాధ్యమవుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని చిత్తూరు రోడ్డులో గల కేజీఎస్ కల్యాణ మండపంలో సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు జరిగాయి. మొదట పట్టణంలోని నేతాజీ సర్కిల్ నుంచి చెక్‌పోస్టు మీదుగా చిత్తూరు మార్గంలోని కేజీఎస్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా వెళ్లి జెండా ఆవిష్కరించి సీతారాం ఏచూరికి నివాళులర్పించి సభను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన గఫూర్ మాట్లాడుతూ దేశంలో సామాన్యులకు న్యాయం జరగడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామ్రాజ్యవాద అనుకూల విధానాన్ని అనుసరిస్తోందంటూ ఆయన మండిపడ్డారు. ఇజ్రాయెల్- పాలస్తీనాల నడుమ యుద్ధంలో మోదీ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు మద్దతునిస్తుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులు, శ్రామికులు, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పోరేట్, మతోన్మాదులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. రూ.49 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి లక్ష కోట్లు నిధులు కేటాయిస్తే కరువును పారదోలవచ్చునన్నారు. సమావేశం అనంతరం పలు తీర్మానాలు చేశారు. ప్రధానంగా విభజన చట్టంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 వేల కోట్లు కేటాయించి మూడేళ్లలో ఖర్చు చేయాలని, జిల్లాలోని అన్నమయ్య, పింఛా, ముదివేడు ప్రాజెక్టుల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులకు పునరావాసం, పునర్నిర్మాణం ప్యాకేజీలను ఇవ్వాలన్నారు. అలాగే రాయచోటి ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా, మదనపల్లె ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా, రాజంపేటలో వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కడప-మదనపల్లె-బెంగుళూరు రైల్వేలైన్ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు రామాంజులు, రవికుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నరసింహులు, రవికుమార్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మణి, వెంకటరామయ్య, రాజమ్మ, జావిద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, అధ్యక్షుడు చంద్రశేఖర్, హరిశర్మ, శివ, పలువురు సీపీఎం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాయచోటిలో ర్యాలీగా వెళుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, సీపీఎం నేతలు

క్రీడలతో మానసిక ఉల్లాసం

● చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి ● రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
● రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభంలో మంత్రి మండిపల్లి


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


కడప-ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

రాయచోటిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలు ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. 68వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో బాలబాలికల కబడ్డీ పోటీలు ఈనెల 27, 28, 29వ తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని ఈ పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహపడకుండా రాబోయే పోటీల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. క్రీడల్లో మంచి నైపుణ్యం సంపాదించినట్లయితే ఈ క్రీడాకారుడు వారి ప్రాంతాల్లోనే కాకుండా ఎక్కడికి వెళ్లినా ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి రాష్ట్రాన్ని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీల్లో 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు క్రీడా జ్యోతి వెలిగించి క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి మంత్రి గౌరవవందనం స్వీకరించిన తదనంతరం కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐవీఈ భానుమూర్తి రాజు, ఇన్‌చార్జి డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత, కడప జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ప్రవీణ్‌కిరణ్, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు, 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన 26 బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. అనంతరం జరిగిన పోటీలో ఈస్ట్ గోదావరి, కడప జట్ల అండర్-17 విభాగంలో జరిగిన పోటీలో కడప జట్టు 31 పాయింట్లు చేయగా 32 పాయింట్లు సాధించి ఈస్ట్‌గోదావరి జట్టు గెలిచింది.


వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు

అటవీ భూములు అన్యాక్రాంతం

భవన నిర్మాణం, పొలాల సాగు ● ప్రేక్షకపాత్రలో అధికారులు ● కోర్టు తలుపు తట్టాల్సిందేనా ?


కమలాపురంలో మామిడి వనంగా రూపుదిద్దుకున్న రిజర్వ్ ఫారెస్ట్ భూమి

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అటవీ కార్యాలయానికి కనుచూపుమేరలోనే అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఆక్రమిత స్థలంలో అనధికార వెంచర్ వేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. మరికొందరు పొలాలుగా, చిన్న చిన్న పరిశ్రమలు నిర్వహిస్తున్నా అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. అటవీ భూముల మీదుగా రోడ్డు వేయాలన్నా, రైలు మార్గం ఏర్పాటు చేయాలన్నా ఒక పట్టాన అనుమతులు రావు. కానీ వీరు తలచుకుంటే ఏమైనా చేయగలరనే ధీమాను ప్రదర్శిస్తుంటారు. భారీ స్థాయిలో ఆక్రమణ జరుగుతున్నా పట్టించుకునే వారు లేకపోయారు. అటవీ ఆక్రమణలను తొలగించాలంటే సామాజికవేత్తలు కోర్టును ఆశ్రయిస్తే తప్ప అధికారుల్లో చలనం రాదనే భావన కలుగుతోంది. వివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు రిజర్వ్ ఫారెస్టు పరిధి బైపాస్‌రోడ్డు మొదలు ప్రొద్దుటూరు పట్టణ సమీపంలో అటవీశాఖ కార్యాలయం వరకు 158 హెక్టార్లలో స్థలాన్ని పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించారు. ఇందులో ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే విజయ పాలకర్మాగారం ఏర్పాటు చేశారు. అయితే క్రమంగా పాలకర్మాగారం మూతపడడంతో ఇతర పరిశ్రమలు ఏవీ ఏర్పాటు కాకపోగా స్థలం నిరుపయోగంగా ఉండేది. ఇదే అదనుగా భావించి రాజకీయ ప్రాబల్యం కలిగిన కొందరు స్థలాలను ఆక్రమించి విక్రయించడం ప్రారంభించారు. ఈ విషయంపై ఒక సామాజికవేత్త లోకాయుక్తను ఆశ్రయించడంతో నిర్మాణాలు తొలగించాలంటూ స్థానికులకు అటవీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆ స్థలం ఎవరిదనేదీ తెలియకుండా కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన తరువాత తొలగించాలంటూ అధికారులు వత్తిడి చేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఈభూమి రెవెన్యూ రికార్డుల్లో ఏటి పోరంబోకుగా నమోదైనట్లు తెలుస్తోంది. పూర్వపు ప్రొద్దుటూరు అటవీ డివిజన్ పరిధిలో వేలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం అటవీ స్థలాలు కాపాడుకునేలా చర్యలు తీసుకుంటూ అడుగులు వేస్తోంది. ఎంతో విలువైన భూములు కొందరు ప్రైవేటు వ్యక్తులు దర్జాగా ఆక్రమించి అనుభవిస్తున్నారు. ఇంతకాలం అటవీ భూములు ఆక్రమించారని క్షేత్రస్థాయిలో సిబ్బంది ఆడపాదడపా దాడులు చేసిన సందర్భాలున్నాయి. ఏళ్ల తరబడి అటవీ భూములుగా ఉన్న స్థలాలు ఇప్పటికప్పుడు ఏటిపోరంబోకు స్థలాలనే అంశం తెరపైకి రావడం గమనార్హం. చాలా చోట్ల అటవీ భూములు ఎంత మేర ఉన్నాయని నిగ్గుతేల్చేందుకు సర్వే చేయించాలనే ఆలోచనతో అటవీ అధికారులు ప్రయత్నం చేస్తున్నా తగినంత స్పందన లేకపోవడంతో ఆక్రమణల తొలగింపు విషయం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంలా తయారైంది.

నిర్మాణాలు, పొలాల సాగు

అటవీ స్థలాలు ఇప్పటికప్పుడు ఆక్రమించారనుకుంటే పొరబాటు. దాదాపు దశాబ్దాలుగా ఆక్రమణల పర్వం కొనసాగుతూ వస్తోంది. ఎప్పటికప్పుడు అడ్డుకుని చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులకు అడ్డులేకుండా పోయింది. ప్రొద్దుటూరు అటవీశాఖ కార్యాలయం, ఏకో పార్క్ ఎదురుగా ఉన్న స్థలంలో 150 హెక్టార్లు మాత్రమే ఉండగా మిగిలిన స్థలం ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలపడంతో భారీస్థాయి పండ్ల తోటలు, గృహనిర్మాణాలు వెలిశాయనే ఆరోపణలు లేకపోలేదు. నిబంధనలు పక్కనబెట్టి వీటికి విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారు. అక్రమార్కుల్లో రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. అయితే వీరికి కొందరు అటవీ ఉద్యోగులు కూడా సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నాగసానిపల్లె, కమలాపురం రిజర్వు ఫారెస్టు స్థలం దాదాపు అక్రమణదారులు మామిడి వనాలు సాగు చేసుకుని అనుభవిస్తున్నారు. పోరుమామిళ్ల రేంజ్‌లో 44 హెక్టార్లు ఆక్రమణలకు గురైనట్లు సమాచారం. ఇందులో అత్యధిక భాగం జ్యోతి క్షేత్రంలో ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అడవుల పరిరక్షణపై దృష్టి సారించడంతో ఆక్రమణదారుల కబంద హస్తాల నుంచి బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఆక్రమణదారులు మేలు చేసే అధికారులు లేకపోలేదు. నిబంధనల ప్రకారం నోటీసు ఇస్తారు. వాటి ఆధారంగా కోర్టును ఆశ్రయించడంతో ఆక్రమణ దారులకు కొంతకాలం ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం చొరవ తీసుకుని ఇలాంటి వాటిపై కాలయాపన చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అలసత్వం వీడాలి

ఆక్రమణలో ఉన్న అడవులను కాపాడుకోవడానికి అధికారులు అలసత్వం వీడాల్సిన అవసరం ఉంది. ప్రొద్దుటూరులో విలువైన స్థలాలు కళ్ల ఎదుటే ఆక్రమణలకు గురవుతున్నా దశాబ్దాలుగా అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక సామాజిక వేత్త లోకాయుక్తను ఆశ్రయించడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. దాదాపు వంద మందికి పైగా గృహా లు నిర్మాణం చేపట్టిన వారికి నోటీసులు ఇస్తారు. ఒక పక్కన లోకాయుక్త ఆదేశాలుండడం, మరో పక్క చిత్తశుద్ధి కలిగిన అధికార యంత్రాం గం ఆక్రమణలు తొలగించడంపై దృష్టి సారిస్తున్నారు. ఒక ప్రొద్దుటూరు పట్టణంలోనే కాకుండా జిల్లాలో మరికొన్ని చోట్ల ఆక్రమణలను తొలగించడం కోసం చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.



ప్రొద్దుటూరు నగరవనం వద్ద జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు
ప్రొద్దుటూరులో అటవీ స్థలాల ఆక్రమణలను గుర్తిస్తున్న అధికారులు

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన ప్రాంతాలు

- రామేశ్వరం, పెన్నార్‌బ్లాక్ 1, 2, 3
- వెదురూరు రిజర్వు ఫారెస్టులో 732 హెక్టార్లు
- కల్లమల రిజర్వులో పెన్నార్ 5, 6 బ్లాక్
- నాగసానిపల్లె, కమలాపురం రిజర్వ్ ఫారెస్టు స్థలం
- ముద్దనూరు రేంజ్‌లో 14000 హెక్టార్లు
- కొండాపురం మండలం వెంకయ్యకాల్వ రిజర్వు ఫారెస్టు
- జమ్మలమడుగు మండలం శెట్టివారిపల్లె వద్ద పెన్నేరు బ్లాక్
- తొండూరు మండలం మల్లెల
- వనిపెంట రేంజ్ పరిధిలో 29వేల హెక్టార్లు
- పోరుమామిళ్ల రేంజ్‌లో 44 హెక్టార్లు
- బద్వేలు రేంజ్ పరిధిలో బ్రాహ్మణపల్లె వద్ద సుమారు 46వేల హెక్టార్లు

ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకుంటున్నాం



అటవీ స్థలాలను గుర్తించి ఆక్ర మితుల నుంచి స్వాధీనం చేసుకుంటాం. ప్రొద్దుటూరు పట్టణంలో ఫారెస్టు కార్యాలయం ఎదురుగా ఇల్లు నిర్మించుకున్న వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. చాలా చోట్ల ఏటిపోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. సర్వే పూర్తయితే కానీ ఆక్రమాలకు గురైంది అటవీ స్థలాలా కాదా అనేది ఒక స్పష్టతకు వస్తుంది. దానికనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

హేమాంజలి, ఫారెస్టురేంజ్ ఆఫీసరు, ప్రొద్దుటూరు

అసైన్డ్ భూముల్లో అక్రమాల దందా

వైసీపీ నేతకు రూ.2కోట్ల భూమి కేటాయింపు ● కలెక్టరుకు బాధితుల ఫిర్యాదు



రెవెన్యూ అధికారులు వైసీపీ నేతకు కట్టబెట్టిన భూమి

అట్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని తంబళ్లగొంది రెవెన్యూ గ్రామంలో 416/2 సర్వేనెంబరులో 4.96 ఎకరాలు అన్నారెడ్డి వెంకటసుబ్బారెడ్డి తండ్రి వెంకటరెడ్డి పేరున డీకేటీ నెం.25/89, 30.07.1979లో ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. ఆయన ఆర్థిక స్తోమత లేక అదే గ్రామానికి చెందిన దుంపల ఈశ్వర్‌రెడ్డికి రూ.5లక్షలకు 2006లో అమ్ముకున్నట్లు స్థానికులు తెలిపారు. అగ్రిమెంటు రాతలు కూడా ఉన్నాయి. కానీ అదే గ్రామానికి చెందిన అన్నారెడ్డి వెంకటరెడ్డి తండ్రి వెంకటసుబ్బారెడ్డి పేరున వైసీపీ నేత రెవెన్యూ అధికారులపై వత్తిడి తీసుకువచ్చి వారికి చేతులు తడిచి 1బీ రికార్డులో 360ఖాతా నెంబరుగా నమోదు చేయించకున్నాడు. అదే గ్రామంలో అన్నారెడ్డి ఇంటి పేరుతో పది కుటుంబాలున్నాయి. అదే ఇంటి పేరు సాకుతో అన్నారెడ్డి వెంకటరెడ్డి పేరు రికార్డుల్లో నమోదు చేశారు. అన్నారెడ్డి వెంకటరెడ్డి చనిపోవడంతో అతనిభార్య సుబ్బమ్మ పేరున 24.08.2015న అక్రమమార్గాన రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేశారు. డీకేటీ భూమిగా ఆన్‌లైన్ చేశారు. 2023లో వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ జీవోను ప్రవేశ పెట్టింది. అదే అదనుగా వైసీపీ నేత రెవెన్యూ అధికారులకు సుమారు 10లక్షల వరకు ముడుపులు చెల్లించినట్లు సమాచారం. 416/2బీగా రికార్డులు మార్చి 4.91 ఎకరాలు ప్రభుత్వ భూమిని నిషిద్ధ జాబితాలో 22ఏ నుంచి తప్పించి ఫ్రీహోల్డ్‌గా నమోదు చేసి బద్వేలు ఆర్డీఓ కార్యాలయానికి రికార్డులు పంపినట్లు బాధితుడు తెలిపారు. ఫ్రీహోల్డ్ జాబితాలో అన్నారెడ్డి సుబ్బమ్మ పేరు నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయం నుంచి రికార్డులు వచ్చిన వెంటనే అన్నారెడ్డి సుబ్బమ్మ వైసీపీ నేత కొత్తపు శ్రీనివాసుల రెడ్డికి సిద్దవటం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించినట్లు బాధితుడు దుంపల రమణారెడ్డి తెలిపారు. ఎన్నో మార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్టోబరు 21న కలెక్టరుకు ఫిర్యాదు చేశారని బాధితుడు బ్రహ్మారెడ్డి తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లాలో 333 దుకాణాలకు అనుమతి

జిల్లా అగ్నిమాపక అధికారి పి.అనిల్ కుమార్


మదనపల్లె మిషన్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న టపాకాయల దుకాణాలు

మదనపల్లె అర్బన్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 333 టపాకాయల దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు అగ్నిమాపక జిల్లా అధికారి పి.అనిల్ కుమార్ తెలిపారు. దీపావళి పండుగ ను పురస్కరించుకుని అగ్నిమాపక శాఖాధికారులు, రెవెన్యూ, పోలీసుల, విద్యుత్‌శాఖ అనుమతులతో జిల్లాలోని ప్రతి డివిజన్‌కు దుకాణా లు ఏర్పాటుకు అనుమతించారు. మదనపల్లె పట్టణంలో రెండుచోట్ల గాంధీ రోడ్డులోని మిషన్ కాంపౌండ్, కదిరి రోడ్డులోని టిప్పు సుల్తాన్ మైదానంలో 45 టపాకాయల దుకాణాలు, ము లకలచెరువులో 16 దుకాణాలకు అనుతించామన్నారు. దుకాణాల ఏర్పాటులో నిర్వాహకులు తగు జాగ్రతలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారమే షాపులు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్కో షాపునకు మధ్య 3 అడుగులు ఖాళీ స్థలం వదలాలని, ప్రతి షాపు యజమాని 200 లీటర్ల వాటర్ డ్రమ్ము ఉంచుకోవాలని, ఈ ఏ డాది ప్రత్యేకంగా ప్రైవేట్ వాటర్ ట్యాంకు అందుబాటులో ఉంచుకుని మా సిబ్బందిని అప్రమత్తం చేస్తామని జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. జిల్లాలో అనుమ తి లేకుండా టపాకాయల దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఏమైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే 101 కానీ, అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయాలన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



- లైసెన్స్ ఉన్న వ్యాపారుల వద్దే బాణసంచా కొనుగోలు చేయాలి.
- పెద్దల పర్యవేక్షణలో టపాకాయలు కాల్చాలి.
- టపాకాయలు కాల్చేందుకు కొవ్వొత్తి, అగరబత్తినే వాడాలి.
- టపాకాయలు కాల్చేసమయంలో నీటితో నిండిన బకెట్‌ను దగ్గర ఉంచుకోవాలి.
- కాలని టపాకాయలను నీళ్లలో వేసేయాలి.
- టపాకాయలను చేతిలో పెట్టుకుని కాల్చరాదు, భూమిపై పెట్టి పొడగాటి అగరబత్తితో కాల్చాలి.
- పనిచేయని టపాకాయలను వెలిగించే ప్రయత్నం చేయరాదు.
- మోల్డ్ బిల్డింగ్‌లలో, ఇళ్ల మధ్యల్లో, గడ్డివాములున్నచోట టపాకాయలను పేల్చరాదు.
- నూలు దుస్తులు ధరించి బాణసంచా కాల్చాలి.
- చట్టవిరుద్ధంగా తయారు చేసిన టపాకాయలను కాల్చరాదు
- పిల్లలు తగు జాగ్రతలు సంతోషంగా దీపావళి పండుగను చేసుకోవాలి

పి.అనిల్ కుమార్, అగ్నిమాపక అధికారి

అనుమతి లేని దుకాణాలపై చర్యలు తప్పవు

అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. అనుమతి కంటే ఎక్కువ స్టాకు అమ్మకాలు నిర్వహిస్తే స్టాకును సీజ్ చేస్తాం. టపాకాయలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఖాజాబీ, తహసీల్దార్, మదనపల్లె

పాత కక్షలతో కత్తితో దాడి...!

గుర్రంకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో అశోక్‌కుమార్‌నాయుడుపై కత్తితో దాడి చేశారని ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయితీ సామన్నపల్లె వాసి అశోక్‌కుమార్ నాయుడు, అదే గ్రామానికి చెందిన గంగాధర్‌నాయుడుకు పాత కక్షలున్నాయి. గతంలో వీరు గొడవపడి నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అశోక్‌కుమార్ తన అక్క రెడ్డినివేదితను ఆదివారం నడిమిఖండ్రిగ పంచాయితీ చింతమాకులపల్లెలో వదిలి తిరిగి బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరాడు. పాత కక్షలను మనుసులో ఉంచుకున్న గంగాధర్ అశోక్‌కుమార్‌ను అనుసరిస్తూ వచ్చాడు. రామస్వామినాయుడుతో కలిసి గంగాధర్‌నాయుడు, కలకడ క్రాస్ వద్ద అశోక్‌కుమార్‌నాయుడుపై కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో అశోక్‌కుమార్‌నాయుడు ఎడమ చేయి అడ్డుపెట్టడంతో రక్తగాయమైంది. చుట్టు పక్కల వారు రావడంతో నిందితులు పరారయ్యారు. గాయపడిన అశోక్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమాజంలో మంచిని పెంచాలి

తుమ్మెదపదాలు పుస్తకం ఆవిష్కరణలో నరాల రామారెడ్డి


తుమ్మెదపదాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నానాటికి విలువలు దిగజారిపోతున్న సమాజంలో మంచిని పెంచాల్సిన అవసరం ఉందని రచయిత కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించిన తుమ్మెదపదాలులో వివరించారని ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి నారాయణాచార్యులు గ్రంథాలయంలో చైతన్య సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన తుమ్మెద పదాలు పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ రచయిత కడప జిల్లా మాండలిక బాషలో గ్రామీణ జీవితం ప్రతిబింబించేలా అనేక కథలను రచించారన్నారు. కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ రచయిత భాష అందరికీ అర్థమయ్యేలా ఉంటుందని, ఈ పుస్తకం మనిషి మానసిక వికాసానికి తోడ్పడుతుందన్నారు. రచయిత కొమ్మిశెట్టి మోహన్ మాట్లాడుతూ రచయిత చుట్టూ ఉన్న సమాజాన్నిబాగా అధ్యయనం చేశారని, సమాజంలోని వింతపోకడలు, విపరీత భావాలను, ధనప్రభావం కనుమరుగు అవుతున్న బంధాలను ఖండిస్తూ మంచిని బోధించేలా తుమ్మెద పదాలను రాశారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డీకే చదువులబాబు మాట్లాడుతూ సమాజ సంస్కరణే ధ్యేయంగా రచనలు సాగించడం అభినందనీయమన్నారు. పుస్తక సమీక్షకులు కొత్తపల్లి శ్రీను మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు, చెడును, స్వార్థాన్ని తప్పుడు విధానాలను ఖండిస్తూ, మంచిని ప్రబోధిస్తూ పుస్తకాన్ని రచించడం హర్షణీయమన్నారు. రచయిత మాట్లాడుతూ నేటి సమాజంలో ఉన్న పోకడలు బాధాకరమని, ప్రజలను చైతన్యపరచడానికే ఈపుస్తకం రచించినట్లు తెలిపారు. ఈ పుస్తకాన్ని రచయిత హేమాద్రిసాగర్‌కు అంకితమిచ్చారు. అనంతరం రచయిత కాశీవరపు వెంకటసుబ్బయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీవీసురేష్, భూక్యా గోపాల్‌నాయక్, పల్లా రామారావు, గజ్జల వెంకటేశ్వరెడ్డి, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మానవతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెంకటేశ్వర్లుపేటలోని సరస్వతి విద్యామందిరంలో ఉన్న మానవతా సంస్థ కార్యాలయంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలకోసం కొలతలు తీసుకున్నారు కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ పట్టణ ఛైర్మన్ కళావతి, అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సన్నుతి శ్రీనివాసులు, మానవతా డైరెక్టర్ శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ సెక్రటరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు27:(ఆంధ్రజ్యోతి) రోడు ప్రమాదంలో పి. రెడ్డెమ్మ గాయపడింది. తాలుకా పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... గుర్రంకొండ మండలం, చింతమాకులపల్లె వాసి రెడ్డెప్ప భార్య పి. రెడ్డెమ్మ తన మనవడి బైక్‌పై మరో మనవడిని చూసేందుకు నిమ్మనపల్లెకు వచ్చింది. మనవడితో మాట్లాడి తిరిగి వెళుతుండగా మదనపల్లె మండలం, బసినికొండలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఇందులో ఆమె తలకు గాయమైంది. స్థానికులు ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

జమ్మలమడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు గోడ పక్కన జూన్స్ హైస్కూలు రోడ్డులో ఆదివారం రాత్రి ఉదయగిరి షఫి (21) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి హుస్సేన్‌బీ జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో రాత్రి ఫిర్యాదు చేసిన మేరకు వివరాల్లోకెళితే... షఫి ప్రొద్దుటూరు వాసి హుస్సేన్‌బీ భర్త ఎనిమిదేళ్ల కిందట మృతి చెందాడు. ఆమె కుమారుడు షఫి స్కూటర్ మెకానిక్‌గా పనిచేసేవాడు. ఇటీవలే ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగుకు వచ్చి బాడుగ ఇంట్లో చేరినట్లు తెలిపింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి అర్బన్ సీఐ లింగప్ప, సిబ్బంది వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

1200 గ్రాముల గంజాయి పట్టివేత - ఒకరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): స్థానిక నాయబ్‌సాబ్‌వీధిలో శనివారం రాత్రి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు దాడులు చేసి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని పాతరాయచోటి వాసి జమాల్‌బాషాను అరెస్టు చేశారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ వివరాలను వెల్లడిస్తూ కొంత కాలంగా పట్టణంలో గంజాయి విక్రయం జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు శనివారం రాత్రి నాయబ్‌సాబ్‌వీధిలో మెరుపుదాడులు చేపట్టారు. అప్పటికే జమాల్‌బాషా గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని అతని నుంచి సుమారు 1200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలియజేశారు.

రాంబాబు మృతిపై కేసు నమోదు

- అనుమానాలున్నాయంటూ తండ్రి ఫిర్యాదు

బి.కొత్తకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గట్టు పంచాయతీ తరిగోడు వద్ద పుంగనూరు వాసి రాంబాబు మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. బి.కొత్తకోట పంచాయతీ బాలసానిపల్లె వాసి స్పందనను రాంబాబు ప్రేమ వివాహం చేసుకున్నాడు. కాగా ఆమెపట్ల అనుమానంతో శనివారం గొడవ పడ్డాడు. తనపై దాడిచేసి గాయపరిచాడంటూ స్పందన ఆస్పత్రిలో చేరింది. అవమానం భరించలేక రాంబాబు ఉరివేసుకుని వుంటాడని పోలీసులు భావించారు. సీఐ రాజారెడ్డి పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, భార్య, ఆమె కుటుంబీకులు చంపి ఆత్మహత్యగా చిత్రీకరించి వుండవచ్చని మృతుడి తండ్రి నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

అదుపుతప్పిన స్కార్పియో

బి.కొత్తకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ఆదివారం అదుపుతప్పిన ఓ వాహనం అందరినీ హడలెత్తించింది. అయితే ఎటువంటి నష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కడపజిల్లా కమలాపురం వాసులు కొందరు పర్యాటకుల బృందం స్కార్పియోలో ఆదివారం హిల్స్ సందర్శనకు వచ్చారు. హిల్స్ పైనున్న చూడదగ్గ ప్రదేశాలన్నీ చూస్తూ జిడ్డు క్రిష్ణమూర్తి విగ్రహం వద్ద వాహనం ప్రమాదవశాత్తూ అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఏపీ టూరిజం అతిథిగృహం వైపు దూసుకెళ్లి విద్యుత్‌స్థంభాన్ని ఢీకొంది. వాహనవేగానికి స్థంభం కదిలి వాహనం మీదికి వరిగింది. విద్యుత్‌వైర్లు సైతం వాహనానికి దగ్గరగా వచ్చాయి. అయితే ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగలేదు. పర్యాటకులు క్షేమంగా వాహనం దిగేశారు. అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపి చర్యలు చేపట్టారు.

ఆక్రమిత స్థలం స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కురబలకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కురబలకోట రెవెన్యూ పంచాయతీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కంటేవారిపల్లె సమీపంలో లోతువంక చెరువు ఆక్రమణకు గురైన సంఘటనపై ఆంధ్రజ్యోతిలో 'చెరువు భూమికే పట్టా ఇచ్చేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులు స్పందించారు. ఆక్రమణకు గురైన భూమి ప్రభుత్వానికి చెందినదిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబ్రమణ్యం, గ్రామ సర్వేయర్ లక్ష్మిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయాన్నిచ్చే జమునాపూరి మేకలు

సంబేపల్లె, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల కాపరులు కొత్త రకా ల వైపు మక్కువ చూపుతున్నారు. సాధారణంగా ఈ ప్రాంతంలో మేక లు అందరూ చూసిఉంటారు. అయి తే జమునాపూరి రకం మేకలు అరుదుగా చూస్తుంటాం. అక్కడక్కడా కొందరు రైతులు కొత్త కొత్త రకాలను తెచ్చి మేపుతున్నారు. ఇందులో భా గంగానే స్థానిక వడ్లపల్లి రోడ్డు మార్గంలో ఉన్న రామచంద్ర గొర్రెల కాపరి జమునాపూరి మేకను మేపుతున్నారు. జమునాపూరి మేక చూడడానికి ఆసక్తి కరంగా ఉంది. చెవులు పొడవుగా, శరీరం జాడుగా ఉండి ఒక్కో మేకపోతు చిన్నపాటి కొడెదూడలా సుమారు 100 కిలోలు బరువును కలిగి ఉంటుంది. ప్రస్తుతం ఈ గొర్రెల కాపరి దగ్గర ఉన్న ఈ మేక రెండు పిల్లలకు జన్మనిచ్చింది. ముస్లింలు బక్రీద్ పండుగ సమయం లో వీటిని అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తారని చెబుతున్నారు. మండలంలో మోటకట్ల రెడ్డివారిపల్లె, మన్నేరు వడ్లపల్లి ప్రాంతంలో ఈ రకపు మేకలు ఉన్నట్లు సమాచారం.


వైద్య పరీక్షలు చేయిస్తున్న మేకల కాపరి


పొడవాటి చెవులతో జమునాపూరి రకం మేక

వీటితో మంచి ధరలు వస్తాయి

ఈ మేకలు మంచి ధరలు ఉంటాయని మేపుతున్నాం. అధిక బరువు కలిగి ఉండడంతో మంచి ధరలు పెట్టి కొనుగోలు చేస్తారు. వీటి ధర లక్షల్లో ఉంటుంది. సాధారణంగా మన మేకపోతులు రూ.20 వేలు ధర ఉంటే ఇవి బక్రీద్ సమయంలో లక్షన్నర కూడా పెట్టి కొనుగోలు చేస్తారు. ఇప్పటికే చాలా మంది అడుగుతున్నారు. ప్రస్తుతం రెండు పిల్లలు ఉన్నాయి.

రామచంద్ర, గొర్రెల కాపరి

చింతలేని ఆరోగ్యానికి... చిరుధాన్యాలు

- క్రమంగా తీసుకుంటే జీవితం ఆనందభరితం
- చిరుధాన్యాలపై ప్రజల్లో పెరిగిన అవగాహన
- జిల్లాలో పెరిగిన చిరుధాన్యాల కొనుగోళ్లు
- ఆహారపదార్థాలపై ఆసక్తి కనబరుస్తున్న జనం
- జిల్లాలో సాగవుతున్న పంటలు


చిరుధాన్యాలతో చేసిన వంటలను విక్రయిస్తున్న మహిళ

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు నిరుపేదల ఆకలితీర్చిన చిరుధాన్యాలకు ఇప్పుడు మళ్లీ మహర్దశ మొదలైంది. ఆధునిక జీవనంలో పాస్ట్‌ఫుడ్స్ యుగంలో సైతం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్న తపనతో మనలో చాలామంది చిరుధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు. అన్ని పూటల చిరుధాన్యాన్ని ఆస్వాదిస్తున్నారు. హైబీపీ, షుగరు, గుండెజబ్బులు, అధిక బరువు, స్థూలకాయం వంటి వ్యాధుల దాడిని తట్టుకుని వాటి నుంచి బయటపడేందుకు మళ్లీ మన పాతతరం ఆహారపు అలవాట్ల వైపు మొగ్గు చూపడమే పరిష్కారమని చిరుధాన్యాలే ఆరోగ్యానికి శ్రేష్టమని నిపుణులు సూచిస్తున్నారు.

చిరుధాన్యాలతో పొందే ప్రయోజనాలు

చిరుధాన్యాలు చిన్నగా ఉన్నాయని చిన్నచూపు చూడకూడదు. రాగులు, సజ్జలు, కొర్రలులాంటి గింజలు గొప్పగా కనిపించకపోవచ్చు. కానీ ఆరోగ్యానికి ఇది చేసే మేలు మాత్రం అనంతం. నేడు చిరుధాన్యాల్లో బాగా ప్రాచుర్యంలో ఉన్నది జొన్నలు, రాగులు. ఈప్రాంతాల్లో సజ్జ లు కూడా వాడుతున్నారు. కానీ కొర్రలు, అరికెలు, చామలు, ఇంకా చాలానే ఉన్నాయి. వీటి గురించి చాలామందికి తెలియదు. చిరుధాన్యాల్లో పిండి పదార్థంతో పాటు ప్రొటీన్లు, పీచు పదార్థం, ఇనుము, క్యాల్షి యం, జింక్‌వంటి సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటా యి. చిరుధాన్యాల్లో పొట్టుతీసినా కాస్త కొవ్వు ఉం టుంది. పైగా ఇది మంచి కొవ్వు. దీంతో శరీరానికి అవ సరమైన కొవ్వు ఆమ్లాలు లభిస్తాయి. గుండెకు ఎంతో మేలు చేస్తాయి. చిరుధాన్యాలు షుగరు పేషంట్లకు ఒక బలంలాంటిది. చిరుధాన్యాల్లో పీచు ఎక్కువగా ఉండ డం వల్ల బియ్యంతో పోలిస్తే ఇవి నెమ్మదిగా జీర్ణమ వుతాయి. వీటిలో గ్లూకోజ్ కూడా రక్తంలో కలుస్తాయి. చిరుధాన్యాలతో చేసిన పదార్థాలను నములుతూ తిన డానికి కాస్త ఎక్కువ సమయం పట్టడమే కాకుండా తీసుకునే ఆహార పరిమాణం సైతం తగ్గుతుంది. ఆలస్యంగా జీర్ణమవుతుంది. కాబట్టి త్వరగా ఆకలివేయదు. ఇలా ఇది బరువు తగ్గడానికి తోడ్పడతాయి. రక్తంలో కొలె స్ట్రాల్ శాతం అదుపులో ఉంటుంది. చిరుధాన్యాలు శరీ రంలో ఆమ్ల స్థాయి తగ్గడానికి ఉపయోగపడతాయి. దీంతో కడుపులో ఇబ్బంది వంటివి తలెత్తకుండా ఉంటుంది. వీటితో క్యాల్షి యం, ఇనుము లభించడంతోపాటు శరీరంలో మలబద్దకం దూరమవుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న వీటిని ఆహారంలో ఒక భాగంగా చేసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది.

జిల్లాలో సాగు వివరాలు

జిల్లాలో చిరుధాన్యాలు సాగుకు సంబంధించి 2019లో 964 హెక్టార్లలో సాగు విస్తీర్ణం ఉండగా.. 937 హెక్టార్లలో సాగు చేశారు. 2020 ఖరీఫ్‌లో నార్మల్ 1106 హెక్టార్లు, సాగు 2919 , 2021 ఖరీఫ్‌లో 1137 నార్మల్, సాగు 589 హెక్టార్లు , 2022 ఖరీఫ్‌లో 960 హెక్టార్లకు గాను 150 హెక్టార్లు, 2023 ఖరీఫ్‌లో 938 హెక్టార్లు సాగు విస్తీర్ణం ఉండగా, 303 హెక్టార్లు మాత్రమే సాగు చేయడం జరిగింది. అయితే ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి జిల్లాకు అధికంగా చిరుధాన్యాలు దిగుమతి అవుతుండడం గమనార్హం.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఇప్పటి వరకు అలవాటు లేకుండా ఇప్పుడే చిరుధాన్యాలు తినడం మొదలుపెట్టినట్లయితే ఈ విషయాలు తప్పనిసరగా గుర్తు పెట్టుకోవాలి. తేలికపాటి చిరుధాన్యాలు ముందుగా తీసుకుంటూ అలవాటు పడిన తరువాత మిగతా చిరుధాన్యాలు తీసుకోవాలి. ఒక్కసారి అన్నీ తినకూడదు. ఎందుకంటే ఇది జీర్ణ సమస్యలకు దారి తీస్తుంది. జీర్ణ సమస్యలు నివారించాలనుకుంటే వాటిని వండుకునే ముందు తప్పనిసరిగా నాన బెట్టాలి. చిరుధాన్యాలు తీసుకునేముందు నానబెట్టడం మొలకెత్తించడం వంటివి చేయాలి. లేదంటే వాటిలో ఉండే ఫైసిక్ యాసిడ్ ఇతర పోషకాల శోషణను తగ్గిస్తుంది. హైపో థైరాయిడజం ఉన్న వారు చిరుధాన్యాల వినియోగాన్ని నివారించాలి. ఎందుకంటే ఇది అయోడిన్ శోషణకు ఆటం కం కలిగించే గోయిత్రోజన్‌ను కలగి ఉంటుంది. గోధుమలతో చేసుకునే రోటీలు బన్‌లు బిస్కట్లు కేక్‌లు వంటి పదార్థాలను చిరుధాన్యాలతో కూడా తీసుకోవచ్చు. గోధుమలకు చిరుధాన్యాలు మంచి ప్రత్యామ్నాయం.

అనారోగ్యానికి ఏది తినాలి

ప్రస్తుతం చాలమంది ఆరోగ్యం కోసం చిరుధాన్యాలు ఎక్కువగా తింటున్నారు. అరికెలు, చామలు, కొర్రలు, ఇంకా రకరకాల చిరుధాన్యాలు అందుబాటులో ఉండడంతో చాలామంది తమ ఇష్టానుసారంగా వాటిని కొనుగోలు చేసి రోజూ 1 లేదా రెండు పూటలా వాటిన ఆహారంగా తీసు కుంటున్నారు. అయితే ఏఏ అనారోగ్య సమస్యలున్నవారు ఏఏ చిరుధాన్యాలను తినాలో తెలుసుకుందాం.

రాగులు : వీటితో అంబలి, జావ, రాగిముద్ద, రాగి రొట్టె చేసుకుని తినవచ్చు. శరీరా నికి రాగులు చలువ చేస్తాయి. ఎండాకాలంలో వీటిని తీసుకుంటే శరీరానికి చల్లదనం కలుగుతుంది. అలాగే రక్తం బాగా తయారవుతుంది. శరీరానికి శక్తి లభిస్తుంది.

కొర్రలు : అధిక బరువుతో ఇబ్బందులు పడేవారు కొర్రలు వండుకుని తినాలి. దీంతో బరువు త్వరగా తగ్గవచ్చు. వీటిని తినడం వల్ల జీర్ణ సమస్యలు ఉండవు. గుండెజబ్బులు రావు. కీళ్లనొప్పులు తగ్గుతాయి.

చామలు : మైగ్రేన్ సమస్య ఉన్నవారు చామలు వండుకుని తినాలి. దీంతో శరీరానికి పోషకాలు అందిస్తాయి. ఎముకలు నరాలు ధృడంగా మారుతాయి. పేగు క్యాన్సర్ రాదు. బాలింతల్లో పాలు ఎక్కువగా తయారయ్యేలా చేస్తాయి.

ఉలవలు : కీడ్నీ స్టోన్‌లు ఉన్న వారు ఉలవలు తినాలి. వీటి వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మూత్రసంబంధ సమస్యలు పోతాయి.

అరికెలు : డయాబెటిస్, కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్న వారు అరికెలు తినాలి. వీటి వల్ల శరీర రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. అలాగే క్యాన్సర్ రాకుండా ఉంటుంది.

ఊదలు : మలబద్ధకం, జీర్ణ సమస్యలు, డయాబెటిస్ ఉన్న వారు ఊదలు తింటే ఆ సమస్యల నుంచి బయట పడవచ్చు.

జొన్నలు : జొన్నలు తినడం వల్ల జీర్ణ సమస్యలు ఉండవు. శరీర రోగనిరోధకశక్తి పెరుగుతుంది. కేన్సర్ రాకుండా ఉంటుంది.

సజ్జలు : అధిక బరువు, డయాబెటిస్ సమస్య ఉన్నవారు సజ్జలు తింటే ఫలితం ఉంటుంది. వీటి వల్ల జీర్ణ సమస్యలు నయమవుతాయి. రక్త హీనత సమస్య నుంచి బయటపడవచ్చు.


చిరుధాన్యాలతో చేసిన కారపుపదార్థాలు, రాగి సంగటి, కొర్ర అన్నం

చిరుధాన్యాలపై అవగాహన పెరిగింది



ప్రజల్లో చిరుధాన్యాలపై అవగాహన బాగా పెరిగింది. ఎక్కువ శాతం మంది చిరుధాన్యాల కొను గోలు చేస్తున్నారు. మరికొంత మంది తమ వద్ద లభించే చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని కూడా తీసుకుంటున్నారు. ఆహార పదార్థాల సేల్ కూడా బాగా పెరిగింది. ప్రతి రోజూ వెయ్యి నుంచి 2వేల మందికి పైగా చిరుధాన్యాల కొనుగోలుతో పాటు ఆహార పదార్థాలను కూడా తీసుకుంటున్నారు.

-మీనా, చిరుధాన్యాల వ్యాపారి, చిన్నచౌకు, కడప

చిరుధాన్యాలతో ఎన్నో ప్రయోజనాలు



చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలున్నాయి. నా భర్తకు డయాబె టిస్, వీటి వల్ల అతనికి ఎంతో ఉపశమనం లభి స్తుంది. అలాగే చిరుధా న్యాల్లో ఫైబర్ శాతం ఎక్కువ ఉండడంతో అందరూ వీటిని తీసుకోవచ్చు.

-శ్రీకళ, వేంపల్లె

తండ్రి మందలించాడని ఉరివేసుకొని విద్యార్థిని ఆత్మహత్య



వేంపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్లమని తండ్రి మందలించినందుకు షేక్ సానియ (20) అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది.. ఎస్ఐ రంగారావు వివరాల మేరకు.. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సానియా స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. తరచూ కళాశాలకు వెళ్లకపోవడంతో తండ్రి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించాడు. దీంతో ఆ విద్యార్థిని మనస్థాపానికి గురై శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఘటన స్థలాన్ని ఎస్ఐ రంగారావు పరిశీలించి స్థానికులు, కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తండ్రి షామీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్యపై భర్త దాడి... తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న మేరి

జమ్మలమడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని టౌన్ చర్చిలో ఆదివారం ఉదయం తప్పెట మేరి అనే మహిళపై ఆమె భర్త విజయ్ బ్లేడుతో దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... ఎస్సీ కాలనీకి చెందిన మేరీ భర్త విజయ్ కలిసి కూరగాయలు ఆటోలో పెట్టుకుని వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న విజయ్ గతంలో దాడి చేశాడు. పెద్దమనుషులు మాట్లాడి తిరిగి భర్త వద్దకు పంపించారు. ఆదివారం ఉదయం చర్చిలో ప్రార్థనకు వచ్చి కూర్చొని ఉండగా వెనుకవైపు నుంచి బ్లేడుతో దాడి చేశాడు. వెంటనే అక్కడున్నవారు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో మహిళ మృతదేహం లభ్యం

చాపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరాయిపల్లె గ్రామం వద్ద కేసీ కాలువలో ఆదివారం అమిరెడ్డి నాగలక్షుమ్మ (40) అనే మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు.. దువ్వూరు మండలంలోని మదిరేపల్లె గ్రామానికి చెందిన నాగలక్షుమ్మకు మతిస్థిమితం లేకపోవడంతో రెండు రోజుల క్రితం దువ్వూరు వద్ద ఉన్న కేసీ కెనాల్‌లో పడిపోయినట్లు తెలిపారు. అక్కడి నుంచి మృతదేహం కొట్టుకువచ్చి ఇక్కడ తేలినట్లు చెప్పారు. ఆమె భర్త వీరారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ హల్‌చల్


పోలీసులు అదుపులోకి తీసుకున్న వాహనం

బద్వేలుటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ఓ ఆల్విన్ వాహనం డ్రైవర్ మద్యం మత్తులో ఇష్టానుసారం డ్రైవింగ్ చేస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. ఆదివారం 11గంటల ప్రాంతంలో మద్యం మత్తులో ఆల్విన్ వాహనాన్ని డ్రైవర్ ఇష్టానుసారంగా నడుపుతూ సిద్దవటం రోడ్డు నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు అడ్డం వచ్చిన వాహనాలను ఢీకొం టూ వెళ్లిపోయాడు. గమనించిన పోలీసులు వాహనాన్ని అడ్డుకోగా డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా, ఈ ఘటనలో ఒక ద్విచ క్రవాహనం, ఒక కారు కొద్దిగా డ్యామేజ్ కాగా.. వాహనదారులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

గ్యాస్ లీకై మంటలు

వేంపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చింతలమడుగుపల్లె గ్రామంలో గిరిధర్‌రెడ్డి ఇంట్లో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం జరిగింది. మంటలు ఎగిసిపడడంతో వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఫీసర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న సుమారు రూ.20వేలు విలువైన సామాగ్రి నష్టపోయారు. పెద్దనష్టం జరగకుండా ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పివేయడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరం ఉమేశ్‌చంద్ర కల్యాణ మండపంలో అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంటు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠ శాలలు కూడా ఒక కన్నుగా ఉంటాయన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళుతున్నారని తెలిపారు. ప్రైవే టు పాఠశాలల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని.. వాటన్నింటినీ న్యాయపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించడం జరుగుతుందని.. అదే విధంగా ప్రైవేటు పాఠశాలల్లో కూడా పేద విద్యార్థుల కోసం ఆదరించడం జరుగుతుందన్నారు. రాష్ట్రవిద్యాశాఖమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవీ మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యతనిస్తుందని, ప్రైవేటు పాఠశాలల సమస్యలు కూడా త్వరలో పరిష్కరిస్తుందన్నారు. అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంటు అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసులరెడ్డి, సెక్రటరీ రమేశ్‌రెడ్డి, బీరం విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, డిల్లీ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ వివేకానందరెడ్డి, ఏపీపీఎస్ఏ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు, ప్రైవేటు డిగ్రీకళాశాలల ప్రెసిడెంట్ మదన్ మోహన్‌రెడ్డి, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి డిమా ండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ 2023, జూలై నుంచే 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉండగా ఏడాది గడిచినా పీఆర్సీ కమిషన్ కార్యాచరణ ప్రారంభించలేదన్నారు. 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలరు భాస్కర్‌రెడ్డి, నాయకులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సర్వీసు నిబంధనలు తీసుకురావాలి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్వీసు నిబంధనలు తీసుకురావాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఎంఈవో నుంచి ఆర్‌జేడీ వరకు ఉపాధ్యాయులు పదోన్నతులు ఇచ్చేలా సర్వీసునిబంధనలు తీసుకురావాలన్నారు. రాష్ట్రప్రభుత్వం అన్ని యాజమాన్య పాఠశాలలు ఒకే గొడుగు కిందకు తెచ్చి 73, 74 రాజ్యాంగ సవరణలో అమలులోకి తెచ్చి సర్వీసు నిబంధనలు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు ఉమాకాంత్, సాయి, చంద్ర పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 29వ తేదీ మంగళవారం నుంచి వచ్చే నవంబర్ 11 వరకు ఏసీఏ అండర్-14 రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ (గ్రూప్-బి) క్రికెట్ మ్యాచ్‌లు జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. కడపలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంతో పాటు నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం, కెఓఆర్ఎం మైదానాలలో మ్యాచ్‌లు జరుగనున్నట్లు వెల్లడించారు. ఇందులో విశాఖ, శ్రీకాకుళం, క్రిష్ణా, గుంటూరు, అనంతపురం, నెల్లూరు, విజయనగరం, జట్లు పాల్గొంటున్నాయన్నారు.

బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు



పట్టుబడిన మద్యం బాటళ్లు, నిందితుడిని చూపుతున్న పోలీసులు

కడప క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. కడపకు చెందిన కనకయ్య అక్రమంగా మద్యంబాటళ్లు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి అతన్ని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 18 క్వార్టర్ బాటళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కడప క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శ్రీనివాస ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో టాటా సుమో కారు వేగం అదుపు కాక బోల్తాపడింది. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవంతో త్రుటిలో ప్రమాదం తప్పినట్లయింది. రాజంపేట వైపు నుంచి చెన్నూరు వైపు బైపాస్‌రోడ్డులో ఆదివారం రాత్రి వెళుతుండగా కారు అదుపు తప్పిబోల్తా పడింది. వెంటనే సమీపంలో స్థానికులు కారును పైకి లేపారు. కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

బోయకొండలో భక్తులపై టెండరుదారుల దాడి

- ఈవో జోక్యంతో సద్దుమణిగిన వివాదం


భక్తులతో మాట్లాడుతున్న ఈవో ఏకాంబరం

చౌడేపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిత్తూరు జిల్లా బోయకొండలో భక్తులపై టెండరుదారుల అనుచరులు దాడులు చేసి గాయపరచిన ఘటన ఆదివారం జరిగింది. బాధితుల కథనం మేరకు ... అన్నమయ్య జల్లా గాలివీడుకు చెందిన సురేష్‌రెడ్డి ఆర్మీలో పని చేస్తున్నారు. గంగమ్మ మొక్కు నిమిత్తం ఆయన తన బంధుమిత్రులతో కలిసి ఆదివారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. మొక్కుబడిగా అమ్మవారికి పొట్టేలను బలి సమర్పణ చేశారు. ఆతర్వాత క్లీనింగ్ కోసం టెండరుదారుల నుంచి రూ.400 చెల్లించి రసీదు తీసుకున్నారు. అయితే అదనంగా మరో రూ.200 ఇవ్వాలని టెండరుదారులు డిమాండ్ చేయడంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సురేష్ రెడ్డి బంధువులు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయ పడిన వారికి కొండకింద ఉన్న ఆలయ ప్రథమ చికిత్స కేంద్రంలో చికిత్సలు అందించారు. బాధితులు ఈవిషయమై ఈవో ఏకాంబ రానికి తెలపగా ఆయన ప్రథమ చికిత్స కేంద్రం వద్దకు చేరుకుని ఇరువర్గాలను విచారించి గాయపడిన వారికి టెండరుదారుల నుంచి రూ.50వేలు నష్టపరిహారం తీసిచ్చారు. ఇంతటితో ఈ విషయం సద్దుమణిగింది. ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా సంబం ధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇలాంటి విష యాలతో బోయకొండ ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందని భక్తులు కోరుతున్నారు.

పాండిచ్చేరి ముఖ్యమంత్రితో జీఎన్ నాయుడు భేటీ



రాజంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత, రీజెన్సీ సిరామిక్ పరిశ్రమల సంస్థల అధినేత డాక్టర్ జీఎన్‌నాయుడు ఆదివారం పుదిచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామితో భేటీ అయ్యారు. పాండిచ్చేరిలో ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఆంధ్ర రాష్ట్రంతో పాటు పాండిచ్చేరి రాష్ట్రంలోని యానాం, కరైకల్‌లో రీజెన్సీ పారిశ్రామిక సంస్థలపై మాట్లాడారు. యానాంలో రీజెన్సీ పరిశ్రమకు సహజ వాయువు సరఫరా అంశంపై చర్చించారు. పరిశ్రమలకు ప్రభుత్వ సహాయం అందించకపోతే ముందుకు సాగలేమని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి రంగస్వామి రీజెన్సీ పరిశ్రమల సమస్యలు పరిష్కరించడానికి పాండిచ్చేరి ప్రభు త్వం అన్నివిధాల సహకరిస్తుందని హామీ ఇచ్చినట్లు జీఎన్‌నాయుడు తెలిపారు. కార్యక్రమంలో రీజెన్సీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ నరాల సత్యేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గండికోట నుంచి మైలవరానికి 14వేల క్యూసెక్కులు విడుదల

కొండాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి ఆదివారం 14వేల క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తునట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజె క్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా 14 వేల క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరుతున్నట్లు డీఈ తెలిపారు. అదే విధంగా మెయిన్‌కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.06 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

అటవీ భూములు అన్యాక్రాంతం



కమలాపురంలో మామిడి వనంగా రూపుదిద్దుకున్న రిజర్వ్ ఫారెస్ట్ భూమి

భవన నిర్మాణం, పొలాల సాగు ● ప్రేక్షకపాత్రలో అధికారులు ● కోర్టు తలుపు తట్టాల్సిందేనా ?

కడప ఎన్జీఆర్ సర్కిల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అటవీ కార్యాలయానికి కనుచూపుమేరలోనే అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఆక్రమిత స్థలంలో అనధికార వెంచర్ వేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. మరికొందరు పొలాలుగా, చిన్న చిన్న పరిశ్రమలు నిర్వహిస్తున్నా అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. అటవీ భూముల మీదుగా రోడ్డు వేయాలన్నా, రైలు మార్గం ఏర్పాటు చేయాలన్నా ఒక పట్టాన అనుమతులు రావు. కానీ వీరు తలచుకుంటే ఏమైనా చేయగలరనే ధీమాను ప్రదర్శిస్తుంటారు. భారీ స్థాయిలో ఆక్రమణ జరుగుతున్నా పట్టించుకునే వారు లేకపోయారు. అటవీ ఆక్రమణలను తొలగించాలంటే సామాజికవేత్తలు కోర్టును ఆశ్రయిస్తే తప్ప అధికారుల్లో చలనం రాదనే భావన కలుగుతోంది. వివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు రిజర్వ్ ఫారెస్టు పరిధి బైపాస్‌రోడ్డు మొదలు ప్రొద్దుటూరు పట్టణ సమీపంలో అటవీశాఖ కార్యాలయం వరకు 158 హెక్టార్లలో స్థలాన్ని పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించారు. ఇందులో ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే విజయ పాలకర్మాగారం ఏర్పాటు చేశారు. అయితే క్రమంగా పాలకర్మాగారం మూతపడడంతో ఇతర పరిశ్రమలు ఏవీ ఏర్పాటు కాకపోగా స్థలం నిరుపయోగంగా ఉండేది. ఇదే అదనుగా భావించి రాజకీయ ప్రాబల్యం కలిగిన కొందరు స్థలాలను ఆక్రమించి విక్రయించడం ప్రారంభించారు. ఈ విషయంపై ఒక సామాజికవేత్త లోకాయుక్తను ఆశ్రయించడంతో నిర్మాణాలు తొలగించాలంటూ స్థానికులకు అటవీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆ స్థలం ఎవరిదనేదీ తెలియకుండా కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన తరువాత తొలగించాలంటూ అధికారులు వత్తిడి చేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఈభూమి రెవెన్యూ రికార్డుల్లో ఏటి పోరంబోకుగా నమోదైనట్లు తెలుస్తోంది. పూర్వపు ప్రొద్దుటూరు అటవీ డివిజన్ పరిధిలో వేలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం అటవీ స్థలాలు కాపాడుకునేలా చర్యలు తీసుకుంటూ అడుగులు వేస్తోంది. ఎంతో విలువైన భూములు కొందరు ప్రైవేటు వ్యక్తులు దర్జాగా ఆక్రమించి అనుభవిస్తున్నారు. ఇంతకాలం అటవీ భూములు ఆక్రమించారని క్షేత్రస్థాయిలో సిబ్బంది అడపాదడపా దాడులు చేసిన సందర్భాలున్నాయి. ఏళ్ల తరబడి అటవీ భూములుగా ఉన్న స్థలాలు ఇప్పటికప్పుడు ఏటిపోరంబోకు స్థలాలనే అంశం తెరపైకి రావడం గమనార్హం. చాలా చోట్ల అటవీ భూములు ఎంత మేర ఉన్నాయని నిగ్గు తేల్చేందుకు సర్వే చేయించాలనే ఆలోచనతో అటవీ అధికారులు ప్రయత్నం చేస్తున్నా తగినంత స్పందన లేకపోవడంతో ఆక్రమణల తొలగింపు విషయం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంలా తయారైంది.

నిర్మాణాలు, పొలాల సాగు

అటవీ స్థలాలు ఇప్పటికప్పుడు ఆక్రమించారనుకుంటే పొరబాటు. దాదాపు దశాబ్దాలుగా ఆక్రమణల పర్వం కొనసాగుతూ వస్తోంది. ఎప్పటికప్పుడు అడ్డుకుని చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులకు అడ్డులేకుండా పోయింది. ప్రొద్దుటూరు అటవీశాఖ కార్యాలయం, ఏకో పార్క్ ఎదురుగా ఉన్న స్థలంలో 150 హెక్టార్లు మాత్రమే ఉండగా మిగిలిన స్థలం ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలపడంతో భారీస్థాయి పండ్ల తోటలు, గృహనిర్మాణాలు వెలిశాయనే ఆరోపణలు లేకపోలేదు. నిబంధనలు పక్కనబెట్టి వీటికి విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారు. అక్రమార్కుల్లో రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. అయితే వీరికి కొందరు అటవీ ఉద్యోగులు కూడా సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నాగసానిపల్లె, కమలాపురం రిజర్వు ఫారెస్టు స్థలం దాదాపు ఆక్రమణదారులు మామిడి వనాలు సాగు చేసుకుని అనుభవిస్తున్నారు. పోరుమామిళ్ల రేంజ్‌లో 44 హెక్టార్లు ఆక్రమణలకు గురైనట్లు సమాచారం. ఇందులో అత్యధిక భాగం జ్యోతి క్షేత్రంలో ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అడవుల పరిరక్షణపై దృష్టి సారించడంతో ఆక్రమణదారుల కబంధ హస్తాల నుంచి బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఆక్రమణదారులు మేలు చేసే అధికారులు లేకపోలేదు. నిబంధనల ప్రకారం నోటీసు ఇస్తారు. వాటి ఆధారంగా కోర్టును ఆశ్రయించడంతో ఆక్రమణ దారులకు కొంతకాలం ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం చొరవ తీసుకుని ఇలాంటి వాటిపై కాలయాపన చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అలసత్వం వీడాలి

ఆక్రమణలో ఉన్న అడవులను కాపాడుకోవడానికి అధికారులు అలసత్వం వీడాల్సిన అవసరం ఉంది. ప్రొద్దుటూరులో విలువైన స్థలాలు కళ్ల ఎదుటే ఆక్రమణలకు గురవుతున్నా దశాబ్దాలుగా అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక సామాజిక వేత్త లోకాయుక్తను ఆశ్రయించడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. దాదాపు వంద మందికి పైగా గృహా లు నిర్మాణం చేపట్టిన వారికి నోటీసులు ఇస్తారు. ఒక పక్కన లోకాయుక్త ఆదేశాలుండడం, మరో పక్క చిత్తశుద్ధి కలిగిన అధికార యంత్రాం గం ఆక్రమణలు తొలగించడంపై దృష్టి సారిస్తున్నారు. ఒక ప్రొద్దుటూరు పట్టణంలోనే కాకుండా జిల్లాలో మరికొన్ని చోట్ల ఆక్రమణలను తొలగించడం కోసం చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన ప్రాంతాలు

- రామేశ్వరం, పెన్నార్‌బ్లాక్ 1, 2, 3
- వెదురూరు రిజర్వు ఫారెస్టులో 732 హెక్టార్లు
- కల్లమల రిజర్వులో పెన్నార్ 5, 6 బ్లాక్
- నాగసానిపల్లె, కమలాపురం రిజర్వ్ ఫారెస్టు స్థలం
- ముద్దనూరు రేంజ్‌లో 14000 హెక్టార్లు
- కొండాపురం మండలం వెంకయ్యకాల్వ రిజర్వు ఫారెస్టు
- జమ్మలమడుగు మండలం శెట్టివారిపల్లె వద్ద పెన్నేరు బ్లాక్
- తొండూరు మండలం మల్లెల
- వనిపెంట రేంజ్ పరిధిలో 29వేల హెక్టార్లు
- పోరుమామిళ్ల రేంజ్‌లో 44 హెక్టార్లు
- బద్వేలు రేంజ్ పరిధిలో బ్రాహ్మణపల్లె వద్ద సుమారు 46వేల హెక్టార్లు



ప్రొద్దుటూరు నగరవనం వద్ద జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు



ప్రొద్దుటూరులో అటవీ స్థలాల ఆక్రమణలను గుర్తిస్తున్న అధికారులు

ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకుంటున్నాం

అటవీ స్థలాలను గుర్తించి ఆక్ర మితుల నుంచి స్వాధీనం చేసుకుంటాం. ప్రొద్దుటూరు పట్టణంలో ఫారెస్టు కార్యాలయం ఎదురుగా ఇల్లు నిర్మించుకున్న వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. చాలా చోట్ల ఏటిపోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. సర్వే పూర్తయితే కానీ అక్రమాలకు గురైంది అటవీ స్థలాలా కాదా అనేది ఒక స్పష్టతకు వస్తుంది. దానికనుగుణంగా చర్యలు తీసుకుంటాం.



హేమాంజలి, ఫారెస్టురేంజ్ ఆఫీసరు, ప్రొద్దుటూరు

అసైన్డ్ భూముల్లో అక్రమాల దందా

వైసీపీ నేతకు రూ.2కోట్ల భూమి కేటాయింపు ● కలెక్టరుకు బాధితుల ఫిర్యాదు



రెవెన్యూ అధికారులు వైసీపీ నేతకు కట్టబెట్టిన భూమి



అట్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని తంబళ్లగొంది రెవెన్యూ గ్రామంలో 416/2 సర్వేనెంబరులో 4.96 ఎకరాలు అన్నారెడ్డి వెంకటసుబ్బారెడ్డి తండ్రి వెంకటరెడ్డి పేరున డీకేటీ నెం.25/89, 30.07.1979లో ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. ఆయన ఆర్థిక స్థోమత లేక అదే గ్రామానికి చెందిన దుంపల ఈశ్వర్‌రెడ్డికి రూ.5లక్షలకు 2006లో అమ్ముకున్నట్లు స్థానికులు తెలిపారు. అగ్రిమెంటు రాతలు కూడా ఉన్నాయి. కానీ అదే గ్రామానికి చెందిన అన్నారెడ్డి వెంకటరెడ్డి తండ్రి వెంకటసుబ్బారెడ్డి పేరున వైసీపీ నేత రెవెన్యూ అధికారులపై వత్తిడి తీసుకువచ్చి వారికి చేతులు తడిచి 1బీ రికార్డులో 360ఖాతా నెంబరుగా నమోదు చేయించుకున్నాడు. అదే గ్రామంలో అన్నారెడ్డి ఇంటి పేరుతో పది కుటుంబాలున్నాయి. అదే ఇంటి పేరు సాకుతో అన్నారెడ్డి వెంకటరెడ్డి పేరు రికార్డుల్లో నమోదు చేశారు. అన్నారెడ్డి వెంకటరెడ్డి చనిపోవడంతో అతనిభార్య సుబ్బమ్మ పేరున 24.08.2015న అక్రమమార్గాన రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేశారు. డీకేటీ భూమిగా ఆన్‌లైన్ చేశారు. 2023లో వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ జీవోను ప్రవేశ పెట్టింది. అదే అదనుగా వైసీపీ నేత రెవెన్యూ అధికారులకు సుమారు 10లక్షల వరకు ముడుపులు చెల్లించినట్లు సమాచారం. 416/2బీగా రికార్డులు మార్చి 4.91 ఎకరాలు ప్రభుత్వ భూమిని నిషిద్ధ జాబితాలో 22ఎ నుంచి తప్పించి ఫ్రీహోల్డ్‌గా నమోదు చేసి బద్వేలు ఆర్డీఓ కార్యాలయానికి రికార్డులు పంపినట్లు బాధితుడు తెలిపారు. ఫ్రీహోల్డ్ జాబితాలో అన్నారెడ్డి సుబ్బమ్మ పేరు నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయం నుంచి రికార్డులు వచ్చిన వెంటనే అన్నారెడ్డి సుబ్బమ్మ వైసీపీ నేత కొత్తపు శ్రీనివాసులరెడ్డికి సిద్దవటం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించినట్లు బాధితుడు దుంపల రమణారెడ్డి తెలిపారు. ఎన్నో మార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్టోబరు 21న కలెక్టరుకు ఫిర్యాదు చేశారని బాధితుడు బ్రహ్మారెడ్డి తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లాలో 333 దుకాణాలకు అనుమతి

జిల్లా అగ్నిమాపక అధికారి పి.అనిల్ కుమార్



మదనపల్లె మిషన్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న టపాకాయల దుకాణాలు

మదనపల్లె అర్బన్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 333 టపాకాయల దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు అగ్నిమాపక జిల్లా అధికారి పి.అనిల్ కుమార్ తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని అగ్నిమాపక శాఖాధికారులు, రెవెన్యూ, పోలీసుల, విద్యుత్‌శాఖ అనుమతులతో జిల్లాలోని ప్రతి డివిజన్‌కు దుకాణా లు ఏర్పాటుకు అనుమతించారు. మదనపల్లె పట్టణంలో రెండుచోట్ల గాంధీ రోడ్డులోని మిషన్ కాంపౌండ్, కదిరి రోడ్డులోని టిప్పు సుల్తాన్ మైదానంలో 45 టపాకాయల దుకాణాలు, ము లకలచెరువులో 16 దుకాణాలకు అనుతించామన్నారు. దుకాణాల ఏర్పాటులో నిర్వాహకులు తగు జాగ్రతలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారమే షాపులు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్కో షాపునకు మధ్య 3 అడుగులు ఖాళీ స్థలం వదలాలని, ప్రతి షాపు యజమాని 200 లీటర్ల వాటర్ డ్రమ్ము ఉంచుకోవాలని, ఈ ఏ డాది ప్రత్యేకంగా ప్రైవేట్ వాటర్ ట్యాంకు అందుబాటులో ఉంచుకుని మా సిబ్బందిని అప్రమత్తం చేస్తామని జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. జిల్లాలో అనుమ తి లేకుండా టపాకాయల దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఏమైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే 101 కానీ, అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయాలన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



- లైసెన్స్ ఉన్న వ్యాపారుల వద్దే బాణసంచా కొనుగోలు చేయాలి.
- పెద్దల పర్యవేక్షణలో టపాకాయలు కాల్చాలి.
- టపాకాయలు కాల్చేందుకు కొవ్వొత్తి, అగరబత్తినే వాడాలి.
- టపాకాయలు కాల్చేసమయంలో నీటితో నిండిన బకెట్‌ను దగ్గర ఉంచుకోవాలి.
- కాలని టపాకాయలను నీళ్లలో వేసేయాలి.
- టపాకాయలను చేతిలో పెట్టుకుని కాల్చరాదు, భూమిపై పెట్టి పొడగాటి అగరబత్తితో కాల్చాలి.
- పనిచేయని టపాకాయలను వెలిగించే ప్రయత్నం చేయరాదు.
- మోల్డ్ బిల్డింగ్‌లలో, ఇళ్ల మధ్యలో, గడ్డివాములున్నచోట టపాకాయలను పేల్చరాదు.
- నూలు దుస్తులు ధరించి బాణసంచా కాల్చాలి.
- చట్టవిరుద్ధంగా తయారు చేసిన టపాకాయలను కాల్చరాదు
- పిల్లలు తగు జాగ్రతలు సంతోషంగా దీపావళి పండుగను చేసుకోవాలి

పి.అనిల్ కుమార్, అగ్నిమాపక అధికారి

అనుమతి లేని దుకాణాలపై చర్యలు తప్పవు

అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. అనుమతి కంటే ఎక్కువ స్టాకు అమ్మకాలు నిర్వహిస్తే స్టాకును సీజ్ చేస్తాం. టపాకాయలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఖాజాబీ, తహసీల్దార్, మదనపల్లె

పాత కక్షలతో కత్తితో దాడి...!

గుర్రంకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో అశోక్‌కుమార్‌నాయుడుపై కత్తితో దాడి చేశారని ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయితీ సామన్నపల్లె వాసి అశోక్‌కుమార్ నాయుడు, అదే గ్రామానికి చెందిన గంగాధర్‌నాయుడుకు పాత కక్షలున్నాయి. గతంలో వీరు గొడవపడి నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అశోక్‌కుమార్ తన అక్క రెడ్డినివేదితను ఆదివారం నడిమిఖండ్రిగ పంచాయితీ చింతమాకులపల్లెలో వదిలి తిరిగి బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరాడు. పాత కక్షలను మనసులో ఉంచుకున్న గంగాధర్ అశోక్‌కుమార్‌ను అనుసరిస్తూ వచ్చాడు. రామస్వామినాయుడుతో కలిసి గంగాధర్‌నాయుడు, కలకడ క్రాస్ వద్ద అశోక్‌కుమార్‌నాయుడుపై కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో అశోక్‌కుమార్‌నాయుడు ఎడమ చేయి అడ్డుపెట్టడంతో రక్తగాయమైంది. చుట్టు పక్కల వారు రావడంతో నిందితులు పరారయ్యారు. గాయపడిన అశోక్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమాజంలో మంచిని పెంచాలి

తుమ్మెదపదాలు పుస్తకం ఆవిష్కరణలో నరాల రామారెడ్డి



తుమ్మెదపదాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నానాటికి విలువలు దిగజారిపోతున్న సమాజంలో మంచిని పెంచాల్సిన అవసరం ఉందని రచయిత కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించిన తుమ్మెదపదాలులో వివరించారని ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి నారాయణాచార్యులు గ్రంథాలయంలో చైతన్య సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన తుమ్మెద పదాలు పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ రచయిత కడప జిల్లా మాండలిక బాషలో గ్రామీణ జీవితం ప్రతిబింబించేలా అనేక కథలను రచించారన్నారు. కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ రచయిత భాష అందరికీ అర్థమయ్యేలా ఉంటుందని, ఈ పుస్తకం మనిషి మానసిక వికాసానికి తోడ్పడుతుందన్నారు. రచయిత కొమ్మిశెట్టి మోహన్ మాట్లాడుతూ రచయిత చుట్టూ ఉన్న సమాజాన్నిబాగా అధ్యయనం చేశారని, సమాజంలోని వింతపోకడలు, విపరీత భావాలను, ధనప్రభావం కనుమరుగు అవుతున్న బంధాలను ఖండిస్తూ మంచిని బోధించేలా తుమ్మెద పదాలను రాశారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డీకే చదువులబాబు మాట్లాడుతూ సమాజ సంస్కరణే ధ్యేయంగా రచనలు సాగించడం అభినందనీయమన్నారు. పుస్తక సమీక్షకులు కొత్తపల్లి శ్రీను మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు, చెడును, స్వార్థాన్ని తప్పుడు విధానాలను ఖండిస్తూ, మంచిని ప్రబోధిస్తూ పుస్తకాన్ని రచించడం హర్షణీయమన్నారు. రచయిత మాట్లాడుతూ నేటి సమాజంలో ఉన్న పోకడలు బాధాకరమని, ప్రజలను చైతన్యపరచడానికే ఈపుస్తకం రచించినట్లు తెలిపారు. ఈ పుస్తకాన్ని రచయిత హేమాద్రిసాగర్‌కు అంకితమిచ్చారు. అనంతరం రచయిత కాశీవరపు వెంకటసుబ్బయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీవీసురేష్, భూక్యా గోపాల్‌నాయక్, పల్లా రామారావు, గజ్జల వెంకటేశ్వరెడ్డి, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మానవతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెంకటేశ్వర్లుపేటలోని సరస్వతి విద్యామందిరంలో ఉన్న మానవతా సంస్థ కార్యాలయంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలకోసం కొలతలు తీసుకున్నారు కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ పట్టణ ఛైర్మన్ కళావతి, అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సన్మతి శ్రీనివాసులు, మానవతా డైరెక్టర్ శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ సెక్రటరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు27:(ఆంధ్రజ్యోతి) రోడు ప్రమాదంలో పి. రెడ్డెమ్మ గాయపడింది. తాలుకా పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... గుర్రంకొండ మండలం, చింతమాకులపల్లె వాసి రెడ్డెప్ప భార్య పి. రెడ్డెమ్మ తన మనవడి బైక్‌పై మరో మనవడిని చూసేందుకు నిమ్మనపల్లెకు వచ్చింది. మనవడితో మాట్లాడి తిరిగి వెళుతుండగా మదనపల్లె మండలం, బసినికొండలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఇందులో ఆమె తలకు గాయమైంది. స్థానికులు ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

జమ్మలమడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు గోడ పక్కన జాన్స్ హైస్కూలు రోడ్డులో ఆదివారం రాత్రి ఉదయగిరి షఫి (21) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి హుస్సేన్‌బీ జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో రాత్రి ఫిర్యాదు చేసిన మేరకు వివరాల్లోకెళితే... షఫి ప్రొద్దుటూరు వాసి హుస్సేన్‌బీ భర్త ఎనిమిదేళ్ల కిందట మృతి చెందాడు. ఆమె కుమారుడు షఫి స్కూటర్ మెకానిక్‌గా పనిచేసేవాడు. ఇటీవలే ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగుకు వచ్చి బాడుగ ఇంట్లో చేరినట్లు తెలిపింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి అర్బన్ సీఐ లింగప్ప, సిబ్బంది వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

1200 గ్రాముల గంజాయి పట్టివేత - ఒకరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): స్థానిక నాయబ్‌సాబ్‌వీధిలో శనివారం రాత్రి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు దాడులు చేసి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని పాతరాయచోటి వాసి జమాల్‌బాషాను అరెస్టు చేశారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ వివరాలను వెల్లడిస్తూ కొంత కాలంగా పట్టణంలో గంజాయి విక్రయం జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు శనివారం రాత్రి నాయబ్‌సాబ్‌వీధిలో మెరుపుదాడులు చేపట్టారు. అప్పటికే జమాల్‌బాషా గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని అతని నుంచి సుమారు 1200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలియజేశారు.

రాంబాబు మృతిపై కేసు నమోదు

- అనుమానాలున్నాయంటూ తండ్రి ఫిర్యాదు

బి.కొత్తకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గట్టు పంచాయతీ తరిగోడు వద్ద పుంగనూరు వాసి రాంబాబు మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. బి.కొత్తకోట పంచాయతీ బాలసానిపల్లె వాసి స్పందనను రాంబాబు ప్రేమ వివాహం చేసుకున్నాడు. కాగా ఆమెపట్ల అనుమానంతో శనివారం గొడవ పడ్డాడు. తనపై దాడిచేసి గాయపరిచాడంటూ స్పందన ఆస్పత్రిలో చేరింది. అవమానం భరించ లేక రాంబాబు ఉరివేసుకుని వుంటాడని పోలీసులు భావించారు. సీఐ రాజారెడ్డి పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, భార్య, ఆమె కుటుంబీకులు చంపి ఆత్మహత్యగా చిత్రీకరించి వుండవచ్చని మృతుడి తండ్రి నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

అదుపుతప్పిన స్కార్పియో

బి.కొత్తకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్స్‌లీహిల్స్‌లో ఆదివారం అదుపుతప్పిన ఓ వాహనం అందరినీ హడలెత్తించింది. అయితే ఎటువంటి నష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కడపజిల్లా కమలాపురం వాసులు కొందరు పర్యాటకుల బృందం స్కార్పియోలో ఆదివారం హిల్స్ సందర్శనకు వచ్చారు. హిల్స్ పైనున్న చూడదగ్గ ప్రదేశాలన్నీ చూస్తూ జిడ్డు క్రిష్ణమూర్తి విగ్రహం వద్ద వాహనం ప్రమాదవశాత్తూ అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఏపీ టూరిజం అతిథిగృహం వైపు దూసుకెళ్లి విద్యుత్‌స్థంభాన్ని ఢీకొంది. వాహనవేగానికి స్థంభం కదిలి వాహనం మీదికి వరిగింది. విద్యుత్‌వైర్లు సైతం వాహనానికి దగ్గరగా వచ్చాయి. అయితే ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగలేదు. పర్యాటకులు క్షేమంగా వాహనం దిగేశారు. అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపి చర్యలు చేపట్టారు.

ఆక్రమిత స్థలం స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కురబలకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కురబలకోట రెవెన్యూ పంచాయతీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కంటేవారిపల్లె సమీపంలో లోతువంక చెరువు ఆక్రమణకు గురైన సంఘటనపై ఆంధ్రజ్యోతిలో 'చెరువు భూమికే పట్టా ఇచ్చేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులు స్పందించారు. ఆక్రమణకు గురైన భూమి ప్రభుత్వానికి చెందినదిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబ్రమణ్యం, గ్రామ సర్వేయర్ లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయాన్నిచ్చే జమునాపూరి మేకలు

సంబేపల్లె, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల కాపరులు కొత్త రకా ల వైపు మక్కువ చూపుతున్నారు. సాధారణంగా ఈ ప్రాంతంలో మేక లు అందరూ చూసిఉంటారు. అయి తే జమునాపూరి రకం మేకలు అరుదుగా చూస్తుంటాం. అక్కడక్కడా కొందరు రైతులు కొత్త కొత్త రకాలను తెచ్చి మేపుతున్నారు. ఇందులో భా గంగానే స్థానిక వడ్లపల్లి రోడ్డు మార్గంలో ఉన్న రామచంద్ర గొర్రెల కాపరి జమునాపూరి మేకను మేపుతున్నారు. జమునాపూరి మేక చూడడానికి ఆసక్తికరంగా ఉంది. చెవులు పొడవుగా, శరీరం జాడుగా ఉండి ఒక్కో మేకపోతు చిన్నపాటి కొడెదూడలా సుమారు 100 కిలోలు బరువును కలిగి ఉంటుంది. ప్రస్తుతం ఈ గొర్రెల కాపరి దగ్గర ఉన్న ఈ మేక రెండు పిల్లలకు జన్మనిచ్చింది. ముస్లింలు బక్రీద్ పండుగ సమయం లో వీటిని అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తారని చెబుతున్నారు. మండలంలో మోటకట్ల రెడ్డివారిపల్లె, మన్నేరు వడ్లపల్లి ప్రాంతంలో ఈ రకపు మేకలు ఉన్నట్లు సమాచారం.



వైద్య పరీక్షలు చేయిస్తున్న మేకల కాపరి



పొడవాటి చెవులతో జమునాపూరి రకం మేక

వీటితో మంచి ధరలు వస్తాయి

ఈ మేకలు మంచి ధరలు ఉంటాయని మేపుతున్నాం. అధిక బరువు కలిగి ఉండడంతో మంచి ధరలు పెట్టి కొనుగోలు చేస్తారు. వీటి ధర లక్షల్లో ఉంటుంది. సాధారణంగా మన మేకపోతులు రూ.20 వేలు ధర ఉంటే ఇవి బక్రీద్ సమయంలో లక్షన్నర కూడా పెట్టి కొనుగోలు చేస్తారు. ఇప్పటికే చాలా మంది అడుగుతున్నారు. ప్రస్తుతం రెండు పిల్లలు ఉన్నాయి.

రామచంద్ర, గొర్రెల కాపరి

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు తెలుగు సాహితీ పురస్కారం



తెలుగు సాహిత్య పురస్కారం అందుకుంటున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమారి

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి) : స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శెట్టిపల్లె శివకుమారికి తెలుగు సాంస్కృతిక సాహిత్య సమితి ఆధ్వర్యంలో పురస్కారం లభించింది. మోడల్ స్కూల్లో విద్యా బోధనలో ఉన్నత ప్రమాణాలతో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం క్రమశిక్షణ మానసిక వికాసం క్రీడలు, భాష సాహిత్య సాంస్కృతిక అంశాలలో అత్యుత్తమ సేవలు అందించినందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా గంగవరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు తులసినాదం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ కిరణ్ క్రాంతి చౌదరి తెలుగు అష్టావధాని డాక్టర్ అముదాల మురళి, ప్రముఖ రచయిత సాహిత్య వేత్త పలమనేరు బాలాజీ (పెద్దపంజాణి ఎంపీడీవో) ఇతర ఉన్నత తెలుగు పండితుల చేతుల మీదుగా సన్మానం చేసి మెమెంటో ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాలకు చెందిన 12 మందికి ఈ ఉత్తమ సేవా పురస్కారం అం దగా అందులో ప్రిన్సిపాల్‌గా తాను చేసిన కృషిని గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసిన వారందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

యువకుడిపై బీరుబాటిల్‌తో దాడి

● పోలీసులకు ఫిర్యాదు


దాడిలో గాయపడిన శివశంకర్

బి.కొత్తకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిపై మరో యువకుల బృంధం దాడిచేసి గాయపరచిన సంఘటన ఆదివారం బి.కొత్తకోటలో జరిగింది. సీఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు...బి.కొత్తకోట మండలం బీరంగి పంచాయతీ శంకరాపురానికి చెందిన ఎ.శివ శంకర్ ఆదివారం బి.కొత్తకోట పట్టణంలోనికి వచ్చి తిరుగు ప్రయాణంలో శంకరాపురం వెళుతుండగా బెంగళూరు రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు వద్దకు రాగానే బీరంగికి చెందిన హరిప్రతాప్ పలుకరించాడు. అతనితో మాట్లాడేందుకు వెళుతుండగా బీరంగి గ్రామానికి చెందిన కార్తీక్, జగదీష్ అనే వ్యక్తులు వచ్చి శివశంకర్ పై బీరుబాటిల్‌తో దాడి చేశారు. ఈ ఘటనలో శివశంకర్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు శివశంకర్‌ను బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాత కక్షలతో తనపై పథకం ప్రకారం దాడి చేశారన్న బాధితుడి ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరం ఉమేశ్‌చంద్ర కల్యాణ మండపంలో అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంటు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠ శాలలు కూడా ఒక కన్నుగా ఉంటాయన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళుతున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని.. వాటన్నింటినీ న్యాయపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించడం జరుగుతుందని.. అదే విధంగా ప్రైవేటు పాఠశాలల్లో కూడా పేద విద్యార్థుల కోసం ఆదరించడం జరుగుతుందన్నారు. రాష్ట్రవిద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవీ మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యతనిస్తుందని, ప్రైవేటు పాఠశాలల సమస్యలు కూడా త్వరలో పరిష్కరిస్తుందన్నారు.

అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంటు అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసులరెడ్డి, సెక్రటరీ రమేశ్‌రెడ్డి, బీరం విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, డిల్లీ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ వివేకానందరెడ్డి, ఏపీపీఎస్‌ఏ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు, ప్రైవేటు డిగ్రీ కళాశాలల ప్రెసిడెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో కందుకూరు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న కందుకూరు విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యా ర్థులు ప్రతిభ కనపరచి జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. కాగా ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఎన్. బావాజాన్, సైఫ్ అలీ, ఆర్. శ్రీనిధి, పాల్గొన్నారు. కందుకూరు పాఠశాలకు అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందంటూ పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, అక్టోబరు27:(ఆంధ్రజ్యోతి) కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు స్థానిక బెంగళూరు రోడ్డులోని చిప్పిలి సమీపంలోని సురభీకాలనీలో నివాసం ఉన్న షేక్ జబీఉల్లా భార్య షేక్ మెహజాన్(29) కుటుంబ కలహాలతో తీవ్ర మనస్థాపం చెంది ఆదివారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో డాక్టర్ పరిక్షించి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తిరుపతికి తరలిస్తుండగా సాయంత్రం ఆమె మృతి చెందింది. మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా అజయ్‌స్వామి జన్మదిన వేడుకలు


కుటుంబసభ్యులు, అభిమానుల మధ్య జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న వాస్తుపండితులు అజయ్‌స్వామి

మదనపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన ప్ర ముఖ జ్యోతిష్యులు, వాస్తుపండితులు సోమేశ్వర శివక్షేత్రం శ్రీగురు సేవ వ్యవస్థాపకులు అజయ్‌స్వామి జన్మదిన వేడుకలను అభిమానులు, కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక శేషప్పతోటలోని ఆయన స్వగృహంలో ఆదివారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె వద్ద గల సోమేశ్వర శివక్షేత్రం, శ్రీగురు సేవా ఆశ్ర మంలో భక్తులు, ఆయన అభిమానులు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి భక్తులు, అభిమా నులకు పంచిపెట్టారు. అనంతరం పట్టణంలో సామాజిక కార్యక్రమాలతో పాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అజయ్‌స్వామికి భక్తులు, అభిమానులు ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతి నిధి మొటుకు శివ, మోహన్‌రెడ్డి, హరిస్వామి, యుగం ధర్ గోపీ, అనంత, కుటుంబసభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సారా విక్రయదారులు


అదుపులోకి తీసుకున్న సారా విక్రయదారులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి) మదనపల్లె డివిజన్ పరిధిలో నాటుసారా విక్రయిస్తున్న 60 మందిని అదుపులోకి తీసుకుని రెండోరోజు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు మదనపల్లె డీఎస్పీ డి. కొండయ్య నాయుడు తెలిపారు. వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేసి మాదకద్రవ్యాలు అక్రమాలు చేస్తున్న వారిని అదుపులోకి తీసుకొంటున్నట్లు చెప్పారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే మా దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో అసాంఘిక శక్తులను నివారించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

3న యూటీఎఫ్ మహాసభ, స్వర్ణోత్సవాలు


ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను స్వర్ణోత్సవాలకు ఆహ్వానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు27:(ఆంధ్రజ్యోతి) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబరు 3న జిల్లా యూటీఎఫ్ మహాసభలు, 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఆ మేరకు ఆదివారం యూటీఎఫ్ నాయకులు స్వర్ణోత్సవాలకు రావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం అనేక పోరాటాలు చేస్తోందని కితాబిచ్చారు. జిల్లా మహాసభలకు హాజరవుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, డివిజన్ కన్వీనర్ ఎగవింటి సుధాకర్, నాయకులు గాలి రవీంద్ర, మల్లేశ్వరబాబు, శ్రీనప్ప, హరికృష్ణ, విజయ్, రామమూర్తి, రామచంద్ర, సురేంద్ర, హస్సన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

ఓబులవారిపల్లె,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ సబ్ ప్లాన్ కింద చీనీ నిమ్మ రైతు లకు వ్యవసాయ పరికరాలు అందజేసినట్లు అఖిల భార త ఫల పరిశోధన స్థానం, డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యా లయ పరిశోధన స్థానం తిరుపతికి చెందిన అధికారులు తెలిపారు. సబ్‌ప్లాన్ అమల్లో భాగంగా వైస్‌చాన్సలర్ గోపాల్, ప్రధాన శాస్త్రవేత్త మధుమతి, తనూజ, కవిత, సీని యర్ శాస్త్రవేత్త రంజిత్, టెక్నికల్ సిబ్బంది గోపి ఆధ్వర్యంలో పిచికారీ పరికరాలు, పురుగు మందులు, ఎరువులను గోవిందంపల్లె, రాళ్లచెరువుపల్లె, మంగళంపల్లెకు చెందిన సుమారు 20 మంది ఎస్సీ రైతులకు పంపిణీ చేశారు. మురముట్ల పెద్దసిద్దయ్య, పాణ్యం శ్రీనివాసులు, సింగమాల రత్నమ్మ, రుక్మిణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో అభివృద్ధి సాధ్యం


పథ సంచలనం చేస్తున్న స్వయంసేవకులు

ఒంటిమిట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఐకమత్యంతో అభివృద్ధి సాధ్యమని ఆర్ఎస్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక కోదండరామాలయం వెనుకభాగంలో హిం దుత్వంపై అవగాహన కల్పించారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యకర్తలు గ్రామంలో కవాతు నిర్వహించారు. క్రమశిక్షణకు మారుపేరుగా సంఘ్ దేశవ్యాప్తంగా కొనసాగుతోందన్నారు. గ్రామాల్లో మతాలకు తావు లేకుండా అందరూ ఒకేతాటిపై నడవడం ద్వారా ఏదైనా సాధించవచ్చునని సూచిం చారు. క్రమశిక్షణతో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంటిమిట్ట, సిద్దవటం సమా వేశాన్ని నిర్వహించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిద్దవటం, ఒంటిమిట్ట ఎస్ఐలు శివప్రసాద్, చిరంజీవి ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేణుగోపాల్‌రాజు, సుబ్బారెడ్డి, పాటూరు గంగిరెడ్డి, శివరాజు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, అక్టోబరు27:(ఆంధ్రజ్యోతి) యువకుడు యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మదనపల్లె పట్టణం, నీరుగట్టువారి పల్లె చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు వివరాల మేరకు నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీనగర్‌లో నివాసం ఉన్న ఆర్. నాగరాజ(35) తన భార్య భార్య వేంకటేశ్వరీ తనపై అలిగికాపురానికి రాలేదని మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్స కోసం మదన పల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇతనికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

1న చలో విశాఖ

రాయచోటిటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిరక్షణతో పాటు, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నవంబర్ 1న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విశాఖపట్నం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చలో విశాఖపట్నం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగులు వేలాది మంది పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

విభజన, విలీనంతో విద్యా రంగానికి నష్టం

రాయచోటిటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు ఒప్పందంతో రాష్ట్రంలో అమలవుతున్న సా ల్ట్ పథకాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, షేక్. జాబీర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యూటీఎఫ్ ముఖ్య కార్యక ర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాథ మిక పాఠశాలల విభజన, తరగతుల విలీనంతో విద్యారంగానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఈ పథకం అమలుతో ఉపాధ్యాయులకు, బోధనేతర పనులు, యాప్‌లు, అసంబద్ధ శిక్షణ కార్యక్రమాలు, అనవసర ఆన్‌లైన్ పనులు అధికమై బోధన కుంటుపడుతోందన్నారు. అపార్ ఐడీ తయారీ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ప్రశ్నార్థకంగా ఉన్న జీవో 117ను విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల నిర్వహణకు పూర్తి స్థాయిలో గ్రాంట్లు మంజూరు చేయాలని, మన బడి- మన భవి ష్యత్తు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని కోరారు. అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యా బోధన కుంటుపడకుండా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

గాలివీడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి సూచించారు. ఆదివారం గోపనపల్లె గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజ రైన ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి కోసం సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ వెంకట నారా యణరెడ్డి, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, ఈశ్వర్‌రెడ్డి, మహమ్మద్ రఫీ, భద్రప్పనాయుడు, టీడీపీ నాయకులు కోటిరెడ్డి, మురళీనాయుడు, వెంకటచలపతినాయుడు, వీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, మిట్టే నాయక్, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలమల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మరో కోటి మంజూరు

నిమ్మనపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం అటవీ ప్రాంతంలో వెలసిన నేలమల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రెండో విడత కోటి మంజూరు అయినట్లు ఆలయ ఈవో మంజుల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి మొత్తం రూ. 3.18కోట్ల అంచనాతో పనులు చేపట్టాల్సిఉండగా అందులో మొదటి విడతగా రూ. కోటి మంజూరు కాగా ఆ నిధులతో పనులు ప్రారంభించి ఆలయం ప్రారంభిచామని తెలిపారు. అయితే రెండో విడతలో మరో రూ. కోటి రూపాయలు మంజూరు అయిందని మిగిలిన పనులు చేపడతామన్నారు. వచ్చే ఏడాది శివరాత్రికి పూర్తి స్థాయిలో ఆలయ నిర్మాణం చేపడతామని తెలిపారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు అంతేనా..?

● పునాదులకే పరిమితమైన పలు సచివాలయాలు ● అరకొర పనులకు నోచుకోక అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఆర్బీకే కేంద్రం


పునాదులకే పరిమితమైన సచివాలయ భవన నిర్మాణం


అరకొర పనులకు నోచుకోక అసంపూర్తిగా నిలిచిన ఆర్బీకే భవనం

నిమ్మనపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయ, ఆర్బీకే భవనాలు నిధుల కొరత, అప్పటి ప్రభుత్వ నిర్వాకంతో అర్థాంతరంగా ఆగిపోయాయి. కొన్ని చోట్ల పునాదులకే పరిమితం కాగా మరికొన్ని చోట్ల నిర్మాణాలు దాదాపుగా పూర్తి చేసుకున్న అరకొర పనులు చేపట్టక అసంపూర్తిగా కొట్టుమిట్టాడుతున్నాయి. ఇలాంటి వాటిని పూర్తి చేయడానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి నిధుల కొరత పెనుభారంగా మారింది. కాగా నిమ్మనపల్లె మండలంలో 12 సచివాలయాల మంజూరు చేసిన గత వైసీపీ ఒక్క సచివాలయం కూడా పూర్తి కాకపోగా వాటిలో కొన్ని నిర్మాణాలు పునాదుల వరకే పరిమితమయ్యాయి. 10పంచాయతీలకు గాను 12 సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్‌వెల్ఫేర్ సెంటర్, పాల కేంద్రాలను నిర్మించేందుకు సన్నాహాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని తలపెట్టిన ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తి కాలేదు. సచివాలయ నిర్మాణానికి రూ.40లక్షలు, ఆర్బీకేకు రూ.21.50 లక్షలు, హెల్త్‌వెల్ఫేర్ సెంటర్‌కు రూ.18లక్షలు కేటాయించింది. దాదాపు ప్రతి సచివాలయ పరిధిలో 40శాతానికి పైగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా కొన్ని సచివాలయాలు అసంపూర్తిగా ఉండగానే ప్రారంభించారు. మరి కొన్నిచోట్ల గోడలకు వరకు మరోచోట పునాదుకే పరితమయ్యాయి.

వైసీపీ నాయకులే కాంట్రాక్టర్‌గా మారి పనులు చేపట్టారు. కాగా మెటీరియల్ కాస్ట్ ఎక్కువగా వుండడంతో ప్రభుత్వం ఇచ్చే బిల్లులు సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు తెలిపారు. దీంతో గ్రామాలలో నిర్మించిన సచివాలయాలు అలంకారప్రాయంగా మిగిలిపోయి గుదిబండగా మారాయి. దీనిపై పీఆర్ డీఈ శివప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పనులు చేపట్టిన వరకు బిల్లులు మంజూరు అయ్యాయని చెప్పారు. అయితే కొండయ్యగారిపల్లెలో మాత్రమే పునాదుల వరకు నిర్మాణాలు చేసినట్లు తెలిపారు.

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలి

● నగరవనం పరిశీలనలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


నగరవనంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నగర వనం పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. ఆదివారం స్థానిక పుంగనూరు రోడ్డులోని నగర వనాన్ని ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన రూ.2కోట్ల నిధులతో నగరవనాన్ని మదనపల్లెలో నిర్మిస్తుండటం ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు ఇక్కడ వాకింగ్ ట్రాక్, గేమింగ్ జోన్, మెడిటేషన్ సెంటర్లు, యోగా కేంద్రాలకు అనువుగా ఉందన్నారు. ఎఫ్ ఆర్వో వేణుగోపాల్ మాట్లాడుతూ నామమాత్రం ఎంట్రీ ఫీజుతో పట్టణంలోని 2లక్ష ల మందికి అందుబాటులోకి నగర వనాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. డీఆర్వో మదనమోహన్, ఎఫ్‌బీవో త్యాగరాజు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మదనపల్లెలో క్రికెట్‌కు పూర్వ వైభవం తీసుకొద్దాం


మాట్లాడుతున్న కేఎస్ఎస్‌బీ క్రికెట్ క్లబ్ నిర్వాహకుడు ఖాదర్‌బాబా

మదనపల్లె టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు క్రికెట్ క్రీడాకారులకు పుట్టినిల్లుగా నిలిచిన మదనపల్లెలో క్రికెట్‌కు పూర్వ వైభవం తీసుకొద్దామని సీనియర్ క్రీడాకారులు పునురు ద్ఘాటించారు. ఆదివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో కేఎస్ఎస్‌బీ క్రికెట్ క్లబ్ నిర్వాహకులు ఖాదర్‌బాబా ఆధ్వర్యంలో క్రికెట్ సీనియర్ క్రీడాకారులు, ఔత్సాహిక క్రీడాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారుడు సిరాజ్, రంజీ క్రీడాకారుడు షోయబ్‌అహ్మద్ మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో క్రికెట్ అంటేనే మదనపల్లె గుర్తుకు వచ్చేదని అప్పట్లో సరైన ప్రోత్సాహం, వసతులు లేక క్రికెట్‌లో సామర్థ్యం ఉన్నా, క్రీడాకారులు పైకి ఎదగలేక పోయారన్నారు. కేవలం హాకీ, ఫుట్‌బాల్ వైపే క్రీడాకారులు వెళ్లే వారన్నారు. కేఎస్ఎస్‌బీ క్రికెట్ క్లబ్ క్రికెట్‌కు మళ్లీ వన్నె తెచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సీనియర్ క్రీడాకారులు ఫయాజ్ అహ్మద్, ప్రసాదరెడ్డి, నూర్‌అహ్మద్, హరిప్రసాద్, వెంకటేశ్, కేఎస్ఎస్‌బీ క్లబ్ సభ్యులు నరిబా బాయ్, హరి, సలీమ్, హర్ష, ఆజాద్, జ్ఞానేశ్వర్, ఆడిటర్ వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మిట్స్‌లో ఎన్‌పీటీఈఎల్‌కు విశేష స్పందన


ఎన్‌పీటీఈఎల్‌కు పరీక్షకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

కురబలకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీ పంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్‌పీటీఈఎల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సి పాల్ సి.యువరాజ్ మాట్లా డుతూ చెన్నై ఐఐటీ, ఎన్‌పీ టీఈఎల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్వయం పేరుతో వివిధ రకాల సబ్జెక్టులపై జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ పరీక్షలను నిర్వహిం చారు. కాగా ఈ పరీక్షల కు 3,812 మంది దరఖాస్తు చేసుకో గా 3,734 మంది హాజరయ్యారు. ప్రతి ఏడాది రెండు సార్లు విద్యార్థులు, అధ్యాపకులకు పరీక్షలను నిర్వహిస్తారని, ఈ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు ప్రశంసాప త్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.

జేఎన్‌టీయూ కబడ్డీ జట్టుకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్

కురబలకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జేఎన్‌టీయూ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సి పాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ఈసీఈ, ఈ ఈఈ విభాగం మహిళల తృతీయ సంవత్సరానికి చెందిన ఇందు, జయశ్రీలు చిత్తూరు వెంకటేశ్వర ఇం జనీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ సెలక్షన్ క్రీడాపోటీలలో ఇంజనీరింగ్ కళాశాలలకు చెంది న క్రీడాకారులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కర స్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, పీడీ దామోదరన్ తదితరులు అభినందించారు.

మండల వడ్డెర సంఘ అధ్యక్షుడిగా రెడ్డెప్ప


వడ్డెర సంఘం అధ్యక్షుడు రెడ్డెప్పను పూలమాలతో సత్కరిస్తున్న కృష్ణప్ప

రామసముద్రం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల వడ్డెర సంఘ అధ్యక్షుడిగా కెంపుల రెడ్డెప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వడ్డెర సంఘ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప, బిల్డ ర్ రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఆర్ వాలెప్ప ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం మండల వడ్డెర సంఘ సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర ఐక్యత కోసం, సమస్యల సాధన పోరాడాలని పార్టీలకు అతీతంగా పనిచేయాలని సూచించారు. వడ్డెర కులస్థులను ఎస్టీ జాబి తాలో చేర్చాలన్న డిమాండ్‌తో త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలవ నున్నట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన వడ్డెర సంఘ అధ్యక్షుడును మండల మాలమహానాడు అధ్యక్షుడు క్రిష్ణప్ప పూలమాలలు వేసి సత్కరించారు. ఈకార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కోనంగి చిన్నవెంక టప్ప, జిల్లా వడ్డెర సంఘ సభ్యులు దాసమల్లప్ప, టైగర్ శీనా, రాజోలు వెంకటేష్, ఈశ్వర్, డేరంగుల ఈశ్వర్, పద్మనాభరాజు, బంతి వెంకటరమణ, పద్మనాభం, బీజేపీ చలపతి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'మానవత' ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు


సమావేశంలో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు రామచంద్ర

పీలేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మానవత సంస్థ ద్వారా ఇకపై విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పీలేరు మానవత సంస్థ గౌరవాధ్యక్షుడు రామచంద్ర తెలిపారు. పీలేరులో ఆదివారం ఆ సంస్థ నెలవారీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో ఏర్పాటు చేసిన రిటైర్డు ఉపాధ్యాయుల సన్మానం కార్యక్రమం, సభ్యుల సహకారంతో విజయవంతమైందన్నారు. నవంబరు మాసంలో పట్టణంలోని వృద్ధాశ్రమాలు, అనాథలకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాల అధ్యాపకులు రూ.5 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు జగన్మోహన్, కృష్ణమూర్తి, బీవీ సురేశ్, వెంటరమణ, నాగరాజ, రామకృష్ణ పాల్గొన్నారు.

కలకడలో:అందరి సహకారంతో మానవత సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను మరింత విస్తరిస్తామని మండల గౌరవ అధ్యక్షుడు కె.లక్ష్మీరెడ్డి అన్నారు. ఆదివారం కలకడలో జరిగిన నెల వారి సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే సేవా కార్యక్రమాల్లో భాగంగా చుట్టు పక్క గ్రామాలు, మండలాల ప్రజలకు శాంతి రథం, బాడీ ఫ్రీజర్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు మానసిక వికాసం, ప్రజలకు ఆరోగ్య సూత్రలపై అవగాహన, విరివిగా మొక్కలు నాటి సంరక్షించడం తదితర అంశాలను చర్చించారు. కార్యాలయానికి ప్రహరీ నిర్మించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గంగాద్రినాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, వైవిరమణ, పీవీ నాయుడు, వెంకటేశ్వర నాయుడు, ఖాజాపీర్, భాస్కర్‌నాయుడు, సైయ్యద్‌ఖాన్‌లు పాల్గొన్నారు.

పీలేరు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా బలసా వేణుగోపాల్



పీలేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా బలసా వేణుగోపాల్ ఎన్నికయ్యారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయనను నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎన్నికైన ఆయనను మిగిలిన సభ్యులు అభినందించారు.